epaper.samayamdaily.net
APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 | సంచిక : 211 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 10 ఏప్రిల్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5



## పాత వాహనాలకూ
# హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్

- సెప్టెంబరు 30లోగా బిగించుకోవాల్సిందే
- లేదంటే బీమా సహా అన్ని సేవలూ బంద్
- కేసులూ నమోదు చేస్తారు

**సమయం న్యూస్, హైదరాబాద్:** పాత వాహనాన్ని ఉపయోగిస్తున్నారా? అది 2019 ఏప్రిల్ 1వ తేదీకి ముందు తయారైందా? అయితే.. దానికి హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్ఎస్ఆర్పీ) బిగించుకోవాల్సిందే. ద్విచక్ర వాహనం నుంచి నాలుగు చక్రాల బండ్ల వరకు ఏవైనా సరే ఇకపై ఈ నంబర్ ప్లేట్‌ను తప్పనిసరిగా అమర్చుకోవాల్సిందే. దీనికి రవాణాశాఖ సెప్టెంబరు 30వ తేదీని గడువుగా నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలతో బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వాహన రకాన్ని బట్టి నంబర్ ప్లేట్‌కు కనిష్ఠంగా రూ.320.. గరిష్ఠంగా రూ.800గా **తరువాయి 2లో**

## తగ్గనున్న ఈఎంఐల భారం

- ఇల్లు, వాహన రుణాలపై ఈ ఏడాదిలో తగ్గిన అర శాతం వడ్డీ



**సమయం న్యూస్, హైదరాబాద్:** ఇల్లు, వాహనం కొనుగోలుకు రుణం తీసుకోవాలనుకుంటున్న, ఇప్పటికే తీసుకున్న వారికి ఊరట కలిగించే నిర్ణయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బుధవారం తీసుకుంది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.25% నుంచి 6 శాతానికి పరిమితం చేసింది. ఫిబ్రవరిలోనూ రెపోరేటును 0.25% తగ్గించినందున.. 2025లోనే ఇది రెండో రేటు తగ్గింపు. వ్యక్తిగత రుణాలపైనా నెలవారీ **తరువాయి 2లో**

# విద్యార్థుల్లో 'ఓపీటీ' కల్లోలం!

## మూడేళ్ల అనుమతి రద్దుకు బిల్లు తేనున్న అమెరికా?

- కాంగ్రెస్ ఆమోదిస్తే 3 లక్షల మంది భారతీయులు వెనక్కి..
- హెచ్1బీ వీసాలపైనా ఉక్కుపాదం
- దేశం వీడి వెళ్లొద్దంటూ ప్రముఖ కంపెనీల హెచ్చరిక
- గ్రీన్ కార్డుదారులకూ కంటిమీద కునుకు లేదు

**సమయం న్యూస్, హైదరాబాద్:** సుంకాలతో ప్రపంచ దేశాలను గడగడలాడిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. వలస విధానాలతో విదేశీయుల్లో కల్లోలం రేపుతున్నారు. చదువు పూర్తయిన అనంతరం అమెరికాలో మూడేళ్లపాటు ఉండి ఉద్యోగాలను వెతుక్కునేందుకు, పని చేసుకునేందుకు ఇచ్చే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) అనుమతిని రద్దు చేసేందుకు బిల్లు తేవాలని యోచిస్తున్నారు. ఇది విద్యార్థుల్లో కలవరం సృష్టిస్తోంది. ఇక ఉద్యోగం సాధించి హెచ్ 1బీ వీసాల మీద **తరువాయి 2లో**





## గ్యాస్ ధరలను తక్షణం తగ్గించాల్సిందే!

- పెట్రోలియం మంత్రి హర్దీప్‌సింగ్‌కు కేటీఆర్ లేఖ

**సమయం న్యూస్, హైదరాబాద్ :** పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ పెట్రోలియం, సహజవాయు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురికి బుధవారం భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ''ఎల్పీజీ సిలిండర్ ధర రూ.1,100 దాటడం నిరుపేద, పేద, మధ్య తరగతి కుటుంబాలకు మోయలేని భారంగా మారింది. ఎల్పీజీ ధరలు పొరుగు దేశాల్లో కంటే భారత్‌లోనే ఎక్కువగా ఉన్నాయి. వెంటనే పెంచిన ఈ ధరలను తగ్గించాల్సిందే. మరోవైపు **తరువాయి 2లో**





## బ్రిటిషర్ల కంటే
# భాజపా ప్రమాదకరం

- రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఆ పార్టీని ఓడించాలి
- ఏఐసీసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

**సమయం న్యూస్, హైదరాబాద్ :** ''బ్రిటిషర్ల కంటే భాజపా ప్రమాదకరం. ఆంగ్లేయులను దేశం నుంచి వెళ్లగొట్టినట్లే రాహుల్‌గాంధీ నాయకత్వంలో భాజపాను ఓడించాలి'' అని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణలో భాజపాను ఖతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో రెండు రోజుల పాటు జరిగిన 'అఖిల భారత కాంగ్రెస్ కమిటీ' (ఏఐసీసీ) సమావేశంలో బుధవారం **తరువాయి 2లో**

## గ్రూప్1 మెరిట్ జాబితా వెల్లడి

- 1:1 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన
- నాంపల్లిలో ఈ నెల 16, 17, 19, 21 తేదీల్లో ప్రక్రియ

**సమయం న్యూస్, హైదరాబాద్:** రాష్ట్రంలో 563 గ్రూప్ 1 సర్వీసుల ఉద్యోగాల భర్తీకి ధ్రువపత్రాల పరిశీలన కోసం టీజీపీఎస్సీ 1:1 నిష్పత్తిలో మెరిట్ జాబితాను ప్రకటించింది. గ్రూప్ 1లో ఇంటర్వ్యూలు లేకపోవడంతో 1:2కి బదులుగా నేరుగా 1:1 నిష్పత్తిలో అభ్యర్థులను పిలిచింది. ఈ నెల 16, 17, 19, 21 తేదీల్లో **తరువాయి 2లో**

## పన్ను ఎగవేతలకు ఏఐతో చెక్ పెట్టండి

- అధికారులకు సీఎం చంద్రబాబు సూచన
- ఆదాయార్జన శాఖలపై సమగ్ర సమీక్ష

**2లో**






# 90 రోజుల ఊరట

- సుంకాలపై ట్రంప్ అనూహ్య నిర్ణయం
- అప్పటిదాకా అన్ని దేశాలపై 10%
- చైనాతో మాత్రం ఢీ అంటే ఢీ
- 125 శాతానికి పెంపు
- 84 శాతంతో డ్రాగన్ ప్రతీకారం

**2లో**

## అమరావతిలో సొంతింటికి
# సీఎం శంకుస్థాపన

- కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- తరలివచ్చిన అమరావతి రైతులు

**2లో**



# పాత వాహనాలకూ హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్

(మొదటి పేజీ తరువాయి)

ఛార్జీలను ఖరారు చేసింది. నకిలీ నంబర్ ప్లేట్లకు అడ్డుకట్ట వేయడం, దొంగతనాలను అరికట్టడం, వాహనాలు రహదారి భద్రత లక్ష్యంగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో రవాణాశాఖ ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 2019 ఏప్రిల్ 1వ తేదీ నుంచి తయారైన వాహనాలకు హెచ్ఎస్ఆర్పీ నంబర్ ప్లేట్ నిబంధన ఇప్పటికే అమలవుతోంది. ఇప్పుడు పాత వాహనాలకూ దీన్ని తప్పనిసరి చేశారు.

*** వాహన యజమానిదే బాధ్యత**

పాత వాహనాలకు కొత్తనంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత వాహన యజమానిదే అని రవాణాశాఖ తెలిపింది. అది లేని వాహనాలను అమ్మాలన్నా.. కొనాలన్నా రవాణా కార్యాలయంలో పేరు మార్చుకోవడం సాధ్యం కాదు.

వాహన బీమా, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటివి కూడా జారీ చేయరు. గడువు తర్వాత హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే వాహనాలపై కేసులు నమోదు చేస్తారు.

వాహన తయారీ సంస్థలు తమ డీలర్ల వద్ద హెచ్ఎస్ఆర్పీ బిగించే సదుపాయాన్ని కల్పించాలి. ఈ సమాచారం, నంబర్ ప్లేట్ ధరలు డీలర్ల దగ్గర కనిపించేలా ప్రదర్శించాలి. వాహనదారు ఇంటికే వెళ్లి నంబర్ ప్లేట్ బిగిస్తే అదనంగా రుసుం తీసుకోవచ్చు.

వాహనదారులు ఈ ప్లేట్ కోసం www.siam.in వెబ్‌సైట్‌లో ..వాహన వివరాలు నమోదు చేసి బుక్ చేసుకోవాలి. కొత్త ప్లేట్ బిగించాక ఆ ఫొటోను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.



## బ్రిటిషర్ల కంటే భాజపా ప్రమాదకరం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ప్రసంగించారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ''మోదీకి వ్యతిరేకంగా పోరాడేందుకు మనమంతా సిద్ధంగా ఉండాలి. మహాత్మాగాంధీ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ గడ్డపైన, సబర్మతీ నది ఒడ్డున రెండు రోజులుగా కాంగ్రెస్ మేధోమథన సదస్సు నిర్వహిస్తోంది. మోదీ అధికారం చేపట్టిన తర్వాత దేశంలో చేస్తున్న విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసేందుకు సబర్మతి ఒడ్డున సమావేశమయ్యాం.

**రాహుల్ హామీలను అమలు చేశాం**

రైతులకు వ్యతిరేకంగా మోదీ నల్ల చట్టాలు తెచ్చారు. వాటిని నిరసిస్తూ.. రైతులు 15 నెలలపాటు ధర్నాలు చేసినా కేంద్రప్రభుత్వం చర్చలకు రాలేదు. మోదీ మణిపూర్‌లో మంటలు రాజేశారు. దేశ మూలవాసుల జీవన హక్కులను కాలరాసే ప్రయత్నం చేశారు. మరోవైపు కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్‌గాంధీ నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. కులగణన, రైతు రుణమాఫీ, యువతకు ఉద్యోగాల కల్పన, మహిళల సంక్షేమంపై ఆయన వాగ్దానాలు చేశారు. పాదయాత్రలో భాగంగా తెలంగాణకు వచ్చినప్పుడు.. కులగణన, రైతు రుణమాఫీ, నిరుద్యోగ నిర్మూలన, మహిళల సంక్షేమానికి రాహుల్‌గాంధీ హామీలు ఇచ్చారు. వాటి ప్రకారం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల్లోనే 25.25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం. రాష్ట్రంలో కులగణన చేసి చూపించాం. కులగణనపై రాహుల్‌గాంధీ మాట్లాడతారనే భయంతోనే ఆయనకు లోక్‌సభలో మైక్ ఇవ్వలేదు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని మోదీ హామీ ఇచ్చి 11 సంవత్సరాలు దాటిపోయింది. ఈ లెక్కన 20 కోట్లకు పైగా ఉద్యోగాలివ్వాలి. మోదీ, అమిత్ షాలకు మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. ప్రతి ఏటా 2 కోట్ల మంది యువతకు ఉద్యోగాలు రాలేదు. గాంధీజీ 30 ఏళ్లపాటు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దండి సత్యాగ్రహంతో పాటు అనేక పోరాటాలు చేశారు. కానీ బ్రిటిష్ వాళ్లు ఎప్పుడూ ఆయనపై లాఠీ ప్రయోగం చేయలేదు. స్వాతంత్ర్యం వచ్చిన ఆరు నెలల్లోనే గాంధీజీపై గాడ్సే తూటా పేల్చి హత్య చేశారు. గాంధీ ఆలోచనధారతో ఉన్న మనమంతా గాడ్సే వారసులను, మోదీని ఓడించాలి. దేశంలోని మూలమూలన ఉన్న గాంధేయవాదులు మోదీ వ్యతిరేక పోరాటంలో రాహుల్‌గాంధీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నా. రైతులు, యువత, మహిళల కోసం ఈ సమావేశాల్లో సాగిన చర్చలపై ఆశతో నేను ఇక్కడి నుంచి వెళుతున్నా.

**పటేల్‌తో తెలంగాణకు అనుబంధం**

మేం నిజాం ప్రభుత్వం కింద ఉన్నప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో వల్లభ్‌భాయ్ పటేల్ నేతృత్వంలో తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చింది. అందుకే గుజరాత్ ప్రజలతో, వల్లభ్‌భాయ్ పటేల్ వారసులతో మా తెలంగాణ ప్రజలకు సంబంధం ఉంది. అలాగే తెలంగాణ రాష్ట్రాన్ని మాకు సోనియా గాంధీ అందించారు. వల్లభ్‌భాయ్ పటేల్ భూమి నుంచి నేను ఒక్కటే చెబుతున్నా... సోనియా గాంధీ నాయకత్వంలో మేం భాజపాను తెలంగాణలో అడుగుపెట్టనివ్వం. ఆ పార్టీని ఎవరూ క్షమించరు. తెలంగాణలో భాజపాను అడ్డుకునేందుకు, ఓడించేందుకు మేం ఇక్కడి నుంచి ఆశను, ఆదేశాన్ని తీసుకెళ్తున్నాం. రానున్న రోజుల్లో ఆ పార్టీని ఓడించే బాధ్యతను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, గాంధీ వారసులు స్వీకరించాలని నా విజ్ఞప్తి'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన సీఎం**

అహ్మదాబాద్‌లో రెండు రోజులపాటు జరిగిన కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, తెలంగాణకు చెందిన ఇతర ముఖ్యనేతలంతా బుధవారం రాత్రి అహ్మదాబాద్ నుంచి బయలుదేరి హైదరాబాద్ చేరుకున్నారు. మంత్రులు, ఏఐసీసీ కార్యదర్శులు, ఏఐసీసీ సభ్యులు, సీడబ్ల్యూసీ సభ్యులు సహా తెలంగాణ నుంచి మొత్తం 41 మంది ఈ సదస్సులో పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసి దివంగతులైన డి.శ్రీనివాస్‌తో పాటు ఇతర నాయకులు నర్సారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, టి.నాగయ్యలకు సదస్సులో నివాళులు అర్పించారు.

## తగ్గనున్న ఈఎంఐల భారం

(మొదటి పేజీ తరువాయి)

కిస్తీ (ఈఎంఐ) భారం తగ్గుతుంది. ఆర్‌బీఐ రెపో రేటును తగ్గిస్తే.. రెపో ఆధారిత వడ్డీ రేటుకు రుణం తీసుకున్న గృహరుణ గ్రహీతలకు ఆ మేర ఉపశమనం కలుగుతుంది. అత్యధిక బ్యాంకులు రెపో రేటుపై 2.65% వరకు, మరికొన్ని 2.75% వరకు అదనంగా వడ్డీ వసూలు చేస్తాయి. దీన్ని బట్టి చూస్తే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ వడ్డీ రేటు (ఈబీఆర్) 8.65 శాతానికి చేరే అవకాశం ఉంది. వడ్డీరేట్లు తక్కువగా ఉన్నప్పుడు గృహరుణాలు తీసుకున్నవారు, కొంతకాలంగా అధిక వడ్డీ భారం మోస్తున్నారు. ముందు అనుకున్న వ్యవధికి మించి, అయిదారేళ్లకు పైగా నెలవారీ కిస్తీలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో రెండు నెలల వ్యవధిలోనే 0.50% మేర వడ్డీ రేటులో కోత పడటంతో, వారికి భారం తగ్గనుంది.

**ఇప్పుడే కాకపోవచ్చు**

ఆర్‌బీఐ రెపో రేటును తగ్గించినా.. అన్ని బ్యాంకులూ గృహరుణ వడ్డీ రేటును తగ్గిస్తాయని చెప్పలేం. కొన్నిసార్లు నిధుల సమీకరణ ఖర్చులు పెరగడం, నికర వడ్డీ మార్జిన్లపై ఒత్తిడి.. వంటి కారణాల వల్ల ఆర్‌బీఐ ప్రయోజనాన్ని, తమ ఖాతాదార్లకు బదిలీ చేయడంలో బ్యాంకులు ఆలస్యం చేయొచ్చు. ఫిబ్రవరి నాటి రేటు తగ్గింపు ప్రయోజనాన్ని కొన్ని బ్యాంకులు ఇప్పటికీ రుణగ్రహీతలకు వర్తింపచేయలేదు కూడా. అందువల్ల రుణం తీసుకున్న బ్యాంకును సంప్రదించి, వడ్డీ తగ్గించారా లేదా అన్నది ఖాతాదారులు సరిచూసుకోవడం ఉత్తమం.

**క్రెడిట్ స్కోరు తక్కువుంటే..**

క్రెడిట్ స్కోరు 750కి మించి ఉన్న వారికే బ్యాంకులు తక్కువ వడ్డీ రేటును వర్తింప చేస్తాయి. ఒకవేళ క్రెడిట్ స్కోరు పేలవంగా ఉంటే... గృహరుణాల వడ్డీరేట్ల తగ్గింపు ప్రయోజనం పొందలేరు. అందువల్ల భవిష్యత్తులో ఏదైనా ఒక బ్యాంకు 7.85 శాతానికి గృహ రుణాన్ని అందించినా, ఇది అందరికీ వర్తించకపోవచ్చు.

**అర శాతం తగ్గితే..**

ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రుణాలపై 0.50% (రెండు సార్లు 0.25% చొప్పున) వడ్డీ తగ్గింది. దీంతో గృహరుణ లెక్కలు మారనున్నాయి. ఉదాహరణకు ఒక వ్యక్తి రూ.40 లక్షల గృహ రుణాన్ని 8.75% వడ్డీపై ఇరవై సంవత్సరాల వ్యవధికి తీసుకున్నారనుకుందాం. అప్పుడు నెలవారీ వాయిదా (ఈఎంఐ) రూ. 35,348 అవుతుంది. వడ్డీ అర శాతం తగ్గి 8.25 శాతానికి చేరితే, ఈఐఎం రూ.34,083కు చేరుతుంది. అంటే.. వడ్డీ రూపంలో రుణవ్యవధి తీరే నాటికి రూ.3,09,793 ఆదా అవుతుంది. సాధారణంగా బ్యాంకులు ఈఎంఐ మొత్తాన్ని తగ్గించవు. కాలవ్యవధినే సర్దుబాటు చేస్తాయి. 8.75% వడ్డీ ఉన్నప్పుడు (ఈఎంఐ రూ.35,348) 240 నెలల పాటు వాయిదాలు చెల్లించాల్సి వస్తే... 8.25 శాతానికి వడ్డీ చేరినప్పుడు అదే ఈఎంఐ కొనసాగిస్తే... 220 నెలల్లోనే రుణం పూర్తవుతుంది. ఒకసారి మీ బ్యాంకును సంప్రదించి, పూర్తి వివరాలు తెలుసుకోవాలి. కొత్తగా రుణం తీసుకోవాలనుకునే వారికి, వాయిదా భారం కొంత తగ్గుతుంది. అప్పుడు రుణ అర్హత సైతం పెరగొచ్చు.

**ఎఫ్‌డీలపైనా ప్రభావం**

గత ఏడాది వరకు బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై కాస్త అధిక వడ్డీ రేట్లు లభించాయి. వడ్డీ రేట్లు తగ్గుతున్న క్రమంలో బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ రేట్లలోనూ సర్దుబాటు చేస్తున్నాయి. బ్యాంకులు ప్రత్యేక పథకాలనూ నిలిపి వేస్తున్నాయి. కాబట్టి, ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసేవారు అధిక వడ్డీనిచ్చే బ్యాంకులను పరిశీలించాలి.

**8 శాతానికి దిగిరావచ్చు**

ఈ ఏడాదిలో అర శాతం మేరకు వడ్డీని ఆర్‌బీఐ తగ్గించిన నేపథ్యంలో, గృహరుణ వడ్డీ రేటు కనిష్ఠంగా 8 శాతానికి దిగిరావచ్చు. ప్రస్తుతం ఎస్‌బీఐ గృహరుణాలపై 8.25 9.20% వడ్డీ విధిస్తోంది. ఆర్‌బీఐ తాజా చర్య వల్ల ఈ వడ్డీ రేటు 8.008.95 శాతానికి పరిమితం కావచ్చు.

## 90 రోజుల ఊరట

న్యూయార్క్: ప్రతీకార సుంకాలతో ప్రపంచ దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. అనేక దేశాలపై అమలు కావాల్సిన సుంకాలను 90 రోజులపాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో ఉన్న 10శాతమే అప్పటిదాకా అమలు చేయాలని నిర్ణయించారు. అయితే చైనాతో మాత్రం కయ్యానికి మరింత కాలుదువ్వారు. ఆ దేశంపై ఏకంగా 125 శాతం సుంకాలతో విరుచుకుపడ్డారు. ప్రతీకారంగా చైనా.. అంతే దీటుగా స్పందించింది. అమెరికా నుంచి వచ్చే ఉత్పత్తులపై 84 శాతం సుంకాలను విధించింది. ఇటు కెనడా, ఐరోపా దేశాలూ తగ్గేదే లేదంటూ ప్రతీకార సుంకాలతో విరుచుకుపడ్డాయి. పలు దేశాలు తమను సంప్రదించడంతో 90 రోజుల నిలిపివేత నిర్ణయం తీసుకున్నామని ట్రంప్ ప్రకటించారు. అయితే ప్రపంచ మార్కెట్లు కుప్పకూలుతున్న నేపథ్యంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ నిర్ణయం వెలువడిన వెంటనే అమెరికా మార్కెట్లు లాభాల్లోకి దూసుకెళ్లాయి.

**చైనాపై కసికొద్దీ..**

తొలుత చైనాపై 20 శాతం సుంకాలను ట్రంప్ విధించారు. ఆ తర్వాత దానికి అదనంగా 34 శాతం విధిస్తున్నట్లు ఈ నెల 2వ తేదీన ప్రకటించారు. దీంతో అది 54శాతానికి చేరింది.

## గ్యాస్ ధరలను తక్షణం తగ్గించాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)

పెట్రో రేట్లను సెస్‌ల రూపంలో పెంచుతూ మోదీ ప్రభుత్వం తీవ్ర ఆర్థిక దోపిడీకి పాల్పడుతూ రాష్ట్రాల హక్కులను కబళిస్తోంది. పన్నుల్లో రావాల్సిన న్యాయమైన వాటాను రాష్ట్రాలకు ఇవ్వకుండా... సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి గణనీయంగా సహకరిస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రాలు నిధుల కొరతతో అల్లాడుతుండటం సరికాదు. కేంద్ర ప్రభుత్వ తీరును మార్చుకోవాల్సిందే'' అని తన లేఖలో కేటీఆర్ డిమాండ్ చేశారు.

## విద్యార్థుల్లో 'ఓపీటీ' కల్లోలం!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నవారూ ప్రశాంతంగా లేకుండా వీసా విధానాలను కఠినతరం చేశారు. మరోవైపు గ్రీన్‌కార్డులున్న వారినీ విమానాశ్రయాల్లో గంటల తరబడి తనిఖీ చేయడంద్వారా భయపెడుతున్నారు.

**లక్షల మందిలో అనిశ్చితి!**

ఓపీటీని రద్దు చేసేలా అమెరికా కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టాలనుకుంటున్న బిల్లువల్ల దాదాపు 3 లక్షల మంది భారతీయ విద్యార్థులు కష్టాలను ఎదుర్కోనున్నారు. ఆ బిల్లును సభలో పెట్టి ఆమోదిస్తే.. వారంతా భారత్‌కు తిరిగి రావాల్సి ఉంటుంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ రంగాల్లో (స్టెమ్) అంతర్జాతీయ విద్యార్థులు.. ఓపీటీ అనుమతి పొందడానికి అవకాశముంటుంది. దీనిద్వారా వారు చదువు పూర్తయ్యాక మూడేళ్లపాటు అమెరికాలో ఉండి అనుభవం గడిస్తారు. ఉద్యోగాలను సాధిస్తారు. ఈ ఓపీటీవల్ల భారతీయ విద్యార్థులే అధికంగా లబ్ధి పొందుతుంటారు. 202324లో 97,556 మంది భారతీయులు ఓపీటీ అనుమతి తీసుకున్నారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 41శాతం అధికం. ఓపీటీ రద్దు బిల్లుతో చదువు పూర్తయిన వెంటనే విద్యార్థులంతా అమెరికాను వీడాల్సి ఉంటుంది. దీనివల్ల వారి కెరీర్ దెబ్బతినడంతోపాటు ఆర్థిక సమస్యలు చుట్టుముడతాయి. చాలా మంది విద్యార్థులు ఓపీటీ కాలంలోనే తమ విద్యా రుణాలను తీర్చుకుంటూ ఉంటారు. బిల్లు ఆమోదం పొందితే.. భారతీయ విద్యార్థుల ఉద్యోగావకాశాలకు గండి పడుతుంది. వారంతా ఉద్యోగావకాశాలు లభించే దేశాలకు వలస వెళ్లాల్సి ఉంటుంది. కెనడా, ఐరోపా దేశాల్లో అవకాశాలుంటే అక్కడికి వెళ్తారు. బిల్లు ప్రభావం తమపైనా పడుతుందని అమెరికా విశ్వవిద్యాలయాలు ఆందోళన చెందుతున్నాయి. విదేశీ విద్యార్థుల సంఖ్య తగ్గవచ్చని భయపడుతున్నాయి.

## గ్రూప్1 మెరిట్ జాబితా వెల్లడి

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయం (పూర్వ పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం) పాత క్యాంపస్‌లో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనుంది. ఈ ప్రక్రియకు ఈ నెల 22వ తేదీని రిజర్వు డేగా ప్రకటించింది. గడువు ప్రకారం నిర్ణీత తేదీల్లో హాజరుకాకున్నా, ఎవరివైనా ఒరిజినల్ సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉన్నా... అలాంటి వారి కోసం పరిశీలన కేంద్రం 22న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పనిచేస్తుంది. మెరిట్ జాబితాలోని అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు వెబ్ ఆప్షన్లను నమోదు చేయాలని టీజీపీఎస్సీ కార్యదర్శి డాక్టర్ ఇ.నవీన్ నికొలస్ స్పష్టంచేశారు. ప్రధాన పరీక్షల్లో చూపిన ప్రతిభ, రిజర్వేషన్లు, మల్టీజోన్ల వారీగా పోస్టులను పరిగణనలోకి తీసుకుని 1:1 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేశామని, ఈ జాబితాను వెబ్‌సైట్లో పొందుపరచినట్లు తెలిపారు. ''అభ్యర్థులు ఈ నెల 10 నుంచి పరిశీలన కోసం అవసరమైన మెటీరియల్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను, వాటి రెండు సెట్ల జిరాక్సు ప్రతులను తీసుకురావాలి. నిర్ణీత తేదీలు, రిజర్వుడే రోజున ధ్రువపత్రాలు తీసుకురాని వారికి తదుపరి సమయం ఇవ్వబోం. ధ్రువపత్రాల పరిశీలనకు ఎవరైనా గైర్హాజరైనా, ఎవరిదైనా అభ్యర్థిత్వం తిరస్కరణకు గురైనా, ఆప్షన్లను నమోదు చేయకున్నా... వారి స్థానంలో తదుపరి మెరిట్ అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు పిలుస్తాం'' అని వివరించారు.

## పన్ను ఎగవేతలకు ఏఐతో చెక్ పెట్టండి

అమరావతి: రాష్ట్ర సొంత ఆదాయ వనరులు పెరిగితేనే అసలైన వృద్ధి అని, పన్ను ఎగవేతదారులను పసిగట్టేందుకు ఏఐని వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సచివాలయంలో బుధవారం ఆయన ఆదాయార్జన శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా.. సొంత ఆదాయం పెంచుకునేలా.. పన్నుల వసూళ్లు పెరిగేలా ఆదాయార్జన శాఖలన్నీ పని చేయాలి. మరిన్ని ఆదాయ మార్గాలను వెతకడంతోపాటు ఎక్కడ ఆదాయం తక్కువ వస్తుందో గుర్తించి, కారణాలు వెతికి చర్యలు తీసుకోవాలి. నోటీసుల జారీ, పన్నుల చెల్లింపుల దగ్గర నుంచి రశీదుల ప్రక్రియ వరకు అంతా ఆన్‌లైన్‌లో జరగాలి. చెల్లింపుదారులు, జీఎస్టీ పోర్టల్, ఏపీ రాష్ట్ర డాటా సెంటర్, ఏపీసీటీడీ ఇలా మొత్తం శాఖల సమాచారాన్ని ఏఐతో అనుసంధానించాలి. ఏఐ వినియోగించి యంత్రాంగంలో మరింత వేగం పెంచవచ్చు. ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న రాష్ట్ర సొంత ఆదాయ లక్ష్యం రూ.1,37,412 కోట్లను వందశాతం రాబట్టేలా అన్ని శాఖలు కృషి చేయాలి. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఇచ్చిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ద్వారా వెయ్యిమందికి పైగా బిల్డర్లు అసలు రిజిస్టర్ కాలేదని ఏఐ గుర్తించింది. జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే ఎలాంటి ఆమోదాలైనా ఇవ్వాలి. సాంకేతికతను వినియోగించుకుంటే పన్ను చెల్లింపులు, అనుమతుల వంటివి సులభతరం అవుతున్నాయనే విషయాన్ని వ్యాపారులకు తెలియచేయాలి. గత ప్రభుత్వంలా వ్యాపారులను వేధించడం కూటమి ప్రభుత్వ విధానం కాదు. వారితో సమన్వయం చేసుకుంటూ నిబంధనల ప్రకారం వారు పన్నులన్నీ చెల్లించేలా చూడాలి' అని సీఎం సూచించారు.

**రాష్ట్ర సొంత ఆదాయంలో 2.2% వృద్ధి**

202324 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 202425కి గాను రాష్ట్రానికి సొంతంగా ఆదాయంలో 2.2% వృద్ధి నమోదైంది. పన్నుల రూపంలో వచ్చే ఆదాయంలో వృద్ధి 4.1% నమోదు కాగా, పన్నేతర ఆదాయం మాత్రం ఆశించిన స్థాయిలో లేదు.

## అమరావతిలో సొంతింటికి సీఎం శంకుస్థాపన

అమరావతి : అమరావతిలో సొంతింటి నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి నిరాడంబరంగా కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఇంటి నిర్మాణం కోసం ఇటీవల వెలగపూడి రెవెన్యూ పరిధిలోని ఇ6 రోడ్డు పక్కన 5 ఎకరాల స్థలం కొనుగోలు చేశారు. ఉదయం 7.30 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి చంద్రబాబు ఈ స్థలం వద్దకు చేరుకున్నారు. నైరుతి దిక్కున ప్రత్యేకంగా వేసిన పందిరి కింద మంగళవాద్యాలు, మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు, భువనేశ్వరి, దేవాంశ్‌లు ముందు వరుసలో కూర్చొని పూజలు చేశారు. వీరి వెనుక మంత్రి లోకేశ్, బ్రాహ్మణి కూర్చున్నారు. పూజ అనంతరం ముహూర్త సమయం 8.51 గంటలకు శంకుస్థాపన చేశారు. చంద్రబాబు కుటుంబానికి స్థలం విక్రయించిన వెలగపూడి గ్రామానికి చెందిన సాంబశివరావు, శాంతకుమారి, గీత, శాంతికిరణ్ కార్యక్రమానికి హాజరయ్యారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి చంద్రబాబు స్థలంలో కలియతిరిగారు. ఇంటిప్లాన్‌ను లోకేశ్ వివరించారు. అక్కడున్న ఇంజినీర్లు, కార్మికులను పలకరించారు.

*** అమరావతిలో ఇంటి నిర్మాణం... మా నిబద్ధతకు ప్రతీక: లోకేశ్**

అమరావతిలో ఇంటి నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు భూమి పూజ చేయడం... ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతిని మార్చడానికి తమకున్న నిబద్ధతకు ప్రతీక అని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇది తమ కుటుంబానికి ఎంతో భావోద్వేగంతో నిండిన రోజు అని ఎక్స్‌లో పేర్కొన్నారు. ''ఎంతో గర్వం, కృతజ్ఞతలతో భూమిపూజ కార్యక్రమంలో నా తల్లి భువనేశ్వరి, బ్రాహ్మణి, దేవాంశ్‌లతో కలిసి భాగస్వామ్యం కావడం ఆశీర్వాదంగా అనిపించింది. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు కన్న కలలు సాకారం కానున్నాయి. కోట్ల మంది ప్రజల కలలకు జవసత్వాలు ఇచ్చే ఘట్టం ఇది'' అని లోకేశ్ పేర్కొన్నారు.



## సొంత నిధులతో పురోహితులకు ఆర్థిక సహాయం ఎమ్మెల్యే కాలేరు

అంబర్ పేట, ఏప్రిల్ 9, సమయం న్యూస్: ప్రతి నెల మానవతా దృక్పథంతో పేద బ్రాహ్మణులకు ఆర్థిక సహాయం చేస్తున్న అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్.తన స్వంత నిధులతో 10 మంది పురోహితులకు, ఒకొక్కరికీ రూ 5000/ చొప్పున ప్రతి నెల ఆర్థిక సహాయం అందించడంలో మానవత్వాన్ని చాటుకుంటున్నారు. అందులో భాగంగా వారికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానంటూ ఈరోజు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారందరికీ ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆ బ్రాహ్మణులు ఎమ్మెల్యే గారికి వేదాశిర్వచనం చేశారు.

## వరంగల్ జిల్లాలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలి

* **ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**

అంబర్‌పేట, ఏప్రిల్ 9, సమయం న్యూస్ : బీఆర్ఎస్ రజతోత్సవంలో భాగంగా ఈనెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు భారీ ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం శివం రోడ్డులోని ధ్రువ హోటల్లో నల్లకుంట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఈ భారీ బహిరంగ సభకు



అంబర్ పేట నియోజకవర్గం లోని ప్రతి బస్తీ, ప్రతి గల్లీ, ప్రతి కాలనీ నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో పార్టీ జెండాలను ఎగురవేయాలన్నారు. జెండా ఎగరవేసి పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఉదయం 8:30 కు ఫీవర్ హాస్పిటల్ చౌరస్తాలో జండా ఎగరవేసిన అనంతరం బస్తీలలో జెండా ఎగరవేయాలని సూచించారు. అందరికీ భోజనాల వసతి కూడా ఏర్పాటు చేశామని వివరించారు. ఈ సమావేశంలో డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వి. రవీంద్రరావు, భూపతినాథ్, కిషన్ రావు, విజయేంద్ర సాగర్, భాస్కర్ గౌడ్, గోనె ప్రదీప్ రావు, కూర నరేందర్, పులిజాల గెలవయ్య, ఓం ప్రకాష్ యాదవ్, ఎర్రబోలు నరసింహారెడ్డి, డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్, చంద్రమోహన్, భీష్మ దేవ్, సాయిని మూర్తి, రమణ నాయుడు, శోభ ముదిరాజ్, ఇర్ఫాన సుల్తానా, లావణ్య, వన్నడి రమ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## VDC అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదంతో అణచివేస్తాము

: **పోలీస్ కమీషనర్ వెల్లడి**

నిజామాబాద్, 9 ఏప్రిల్ సమయం న్యూస్ : పోలీస్ కమీషనర్ కార్యాలయం నుండి కీలక ప్రకటన వెలువడింది. గ్రామ అభివృద్ధి కమిటీపై నిజామాబాద్ సిపి పి.సాయి చైతన్య, ఐపీఎస్ పత్రికాముఖంగా కీలక ప్రకటన చేశారు. గత 15 సంవత్సరాల కిందట గ్రామాభివృద్ధి కమిటీలు కొన్ని గ్రామాలలో ఏర్పాటు చేయబడినవి. అయితే, గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వ సాయాన్ని పొందకుండా, వ్యక్తిగత అవసరాలను తీర్చుకోవడానికి ఈ కమిటీలను కొందరు నిర్బంధించుకున్నారు. కాలక్రమంలో, ఈ కమిటీలు అభివృద్ధి పనులను అనుసరించకుండా గ్రామాలలో జరుగుతున్న వివాదాలను పరిష్కరించే పేరుతో పోలీసు కార్యాచరణలకు బదులు, భూ వివాదాలు, సివిల్ కట్టుబడులు, వివాహ సంబంధ సమస్యలు, తదితర సమస్యలు పరిష్కరించేవారు అయ్యారు. ఈ కమిటీల నిర్వాహకులు గ్రామ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, వారి మాటలు తప్పకుండా వినాలంటూ సిద్ధంగా ఉంటారు. గ్రామాభివృద్ధి కమిటీ పేరుతో వారు వ్యవసాయ సరుకుల ధరలు పెంచి, ప్రజల నుండి తప్పుగా డబ్బులు వసూలు చేస్తున్నారు. కూల్ డ్రింక్, బెల్టుషాపులు, కిరాణా షాపుల వద్ద అన్యాయంగా అధిక ధరలను అమలు చేస్తూ, గ్రామంలోని వ్యాపారాలను నియంత్రిస్తారు. వారి



ఆజ్ఞలు తీయడంలో గ్రామ ప్రజలు న్యాయస్థానాన్ని లేదా పోలీసు స్టేషన్లను ఆశ్రయించకుండా, ఈ కమిటీ వారి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ప్రజలను భయపెడతారు. పోలీసు కమీషనర్ ప్రకటన: "గ్రామాభివృద్ధి కమిటీల రూపంలో జరుగుతున్న ఈ అక్రమ కార్యకలాపాలు పూర్తిగా చట్టవ్యతిరేకం. ఎవరికైనా ఈ కమిటీల వలన ఇబ్బందులు తలెత్తిన పక్షంలో, వారు తమ సమీప పోలీసు స్టేషన్ అధికారిని సంప్రదించవచ్చు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాను." భారత ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు ప్రతి వ్యక్తి గౌరవించాలని, గ్రామాభివృద్ధి కమిటీలు తప్పు మార్గంలో వెళ్ళకుండా చట్టాల పరిధిలోనే వారి కార్యకలాపాలు కొనసాగించాలని పోలీస్ కమీషనర్ సూచించారు.

## అంబర్ పేట బస్తీల్లో పర్యటించిన ఎమ్మెల్యే కాలేరు

అంబర్ పేట, ఏప్రిల్ 9, సమయం న్యూస్: అంబర్ పేట్ డివిజన్ హైమద్ నగర్ పాదయాత్ర నిర్వహించిన అంబర్ పెట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్పొరేటర్ తో కలిసి అంబర్ పేట డివిజన్ ఆహ్మద్ నగర్ లో పాదయాత్ర నిర్వహించి బస్తీ లో ఉన్నటువంటి సమస్యలపై సంబంధిత అధికారులతో కలిసి స్థానికంగా ఉన్నటువంటి కలుషిత మంచినీటి సమస్య, డ్రైనేజి సమస్య వీధి దీపాల సమస్యని పరిశీలించి సంబంధిత అధికారులతో సిబ్బందితో మాట్లాడి వెంటనే కలుషిత మంచినీటి సమస్యని పరిష్కరించాలని, నూతన డ్రైనేజ్ పైప్ లైన్ కి కావలసినటువంటి ఏర్పాట్లు చేయవలసిందిగా తెలియజేస్తూ, అలాగే వెలగని వీధిదీపాల స్థానంలో నూతన వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు ఏఈ ప్రదీప్, విద్యుత్ ఏఈ సౌమ్య,వర్క్ ఇన్స్పెక్టర్లు దుర్గ,రమేష్ సిబ్బంది రాజేష్,సతీష్ బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు




సిద్ధార్థ ముదిరాజ్, పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు స్థానిక బస్తీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తలపున మల్లన్నసాగర్.. ఎండిపోతున్న వరి పంటలు..

* **రైతులను ఐక్యం చేసి మల్లన్న సాగర్ తూములు మూసేస్తాం.**
* **నియోజకవర్గ రైతులకు నీరిచ్చిన తర్వాతే తీసుకుపోవాలి..**
* **మల్లన్న సాగర్. పిల్ల కాల్వలను పరిశీలించిన ఎమ్మెల్యే.**

రాయపోల్.ఎప్రిల్ 09.సమయం న్యూస్ : దుబ్బాక నియోజకవర్గ రైతులకు సముద్రంగా ఉన్న మల్లన్న సాగర్ ప్రాజెక్టు నుండి నీటిని సకాలంలో విడుదల చేయకపోవడంతో రైతు యాసంగిలో వేసిన వరి పంట పశువులకు మేతగా మారిందని దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలంలోని ఇందుప్రియల్. మాచిన్ పల్లి. చేగుంట మండలం పోసానిపల్లి. కసంపల్లి. చందాయిపేట మక్క రాజుపేట తదితర గ్రామాలకు మేన్ కెనాల్ ద్వారా మల్లన్న సాగర్ ద్వారా రైతులకు గొలుసు కట్ట చెరువు ద్వారా సాగునీరు అందిస్తూ చెరువులు నుండి ప్రతి రైతుకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పాదయాపన చేసి రైతుల పంట పొలాలను ఎండు దశకు తెచ్చిందని ఆరోపించారు. కెసిఆర్ హయాంలో





మల్లన్న సాగర్. కొండ పోచమ్మ ప్రాజెక్టు నిర్మించి శంకరంపేట. దుబ్బాక. ఉప్పర్ పల్లి. మెదక్. మల్కాపూర్ తదితర మెయిన్ కాలువలు పూర్తయినప్పటికీ వాడి ద్వారా పిల్ల కాలువలు పూర్తి చేసి చెరువుల్లోకి గొలుసు కట్టడం ద్వారా సాగునీరు అందిస్తూ రైతులు ఎంతో సంతోషపడేవారని. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు సాగుచేసిన వరి పంట పశువులకు మేతగా మారడంతో రైతులు పెట్టుబడులు కూడా మునిగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారుల మధ్య సమన్వయం పూర్తిగా లోపించిందని వారు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించడం పట్ల ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్ల కాలువలు పూర్తి చేయడంలో అటు ఇరిగేషన్ అధికారులు. ఇటు ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. నీళ్లు నిధులు నియామకాలపై కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేస్తుందని ఆయన విమర్శించారు. దుబ్బాక నియోజకవర్గం లో ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని. ఇప్పటికే కుడవేల్లి వాగు ద్వారా పంటలకు నీరు అందించడం జరుగుతుందని. మెయిన్ కెనాల్ ద్వారా పిల్ల కాలువలను పూర్తి చేసి చెరువులు నింపి దశలవారీగా దుబ్బాక నియోజకవర్గ పంట పొలాలకు సాగునీరు అందించి మరో కొనసీమగా మారుస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఇరిగేషన్ అధికారులు పట్టణాల్లో ఉండకుండా కాలువల ఫీల్డ్ విజిట్ చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గం సమన్వయకర్త శ్రీనివాస్ గౌడ్. దౌల్తాబాద్. చేగుంట మండలాల రైతులు అధికారులు పాల్గొన్నారు.




## విశాల్ మార్ట్ ముందు చలివేంద్రాన్ని ప్రారంభించిన ఉప్పల శ్రీనివాస్

అంబర్ పేట, ఏప్రిల్ 9, సమయం న్యూస్: రామంతపూర్ విశాల్ మార్ట్ ముందు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రముఖ సంఘ సేవకులు ఉప్పల శ్రీనివాస్ గుప్త చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో జూలూరు తిరుపతి గుప్తా మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బాలుడు పై కుక్కల దాడి

నర్సాపూర్ ఏప్రిల్ 9, (సమయం న్యూస్): నర్సాపూర్ మండలం రుస్తుం పేట గ్రామానికి చెందిన అభిలాష్ (12) కుక్కలు దాడులు తీవ్రంగా గాయపడ్డారు , గ్రామంలో మంగళ వారం సాయంత్రం క్రికెట్ ఆడుతున్న సమయంలో అటుగా వెళ్లిన కుక్కలు ఒక్కసారిగా అభిలాష్ పై దాడి చేశాయి ఈ దాడిని చూసి భయంతో మిత్రులు పారిపోగా సమీపంలో ఉన్న తన సోదరుడికి తెలియగానే వెంటనే తమ్ముడిని కుక్కల బారి నుండి కాపాడారు గాయాలను చూసి వెంటనే తల్లిదండ్రులకు తెలియజేశారు గాయపడిన అభిలాష్ ను వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో డాక్టర్ల సూచన మేరకు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు

## మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగుపై అవగాహన

మహబూబాబాద్, ఏప్రిల్.09( సమయం న్యూస్) : మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగు అవగాహనలో భాగంగా బుధవారం కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు, తొర్రూరు, డోర్నకల్, తదితర మండలాల్లో మల్బరీ సాగు పై పట్టు పరిశ్రమ శాఖ ఉప సంచాలకులు ముత్యాల రావు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన వన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జీనుగు మరియన్న మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న వరి, పత్తి, మొక్కజొన్న, మిరప పంటల కు ప్రత్యామ్నాయంగా మార్కెట్ డిమాండ్ ఉన్న మల్బరీ సాగు చేయాలని రైతులందరితో అన్నారు. మల్బరీ సాగు చేస్తూ రైతులకు 2 ఎకరాలకు 3 లక్షలు రూపాయల నికర ఆదాయం పొందుతున్నారన్నారు. మల్బరీ సాగుకు మొక్కలపై, పట్టు పురుగుల




పెంపకం షెడ్ నిర్మాణం కు, స్టాండులు, మెటీరియల్ మొదలైన వాటికి 4 లక్షల వరకు రాయితీ ప్రభుత్వం కల్పిస్తుంది అని తెలిపినారు. మొక్క నాటిన నుండి పట్టు గూళ్ళు మార్కెటింగ్ వరకు రైతు లు పాటించవలసిన పలు మేలైన యాజమాన్య పద్ధతులు ను రైతులకు తెలిపినారు. రైతులు బోర్లు, బావులు క్రింద ఆయిల్ పామ్, పండ్ల తోటలు, కూరగాయలు, ఆకు కూరలు, పుదీనా,పూలు, సుగంధ ద్రవ్యాలు, మల్బరీ,మునగ,వెదురు,ఔషధ పంటలు, తదితర మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసి ఎకరానికి లక్ష రూపాయలు ఆదాయాన్ని పొందాలని తెలిపినారు. ఈ సందర్భంగా మల్బరీ విజయ గాథల కరపత్రాలను ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జీనుగు మరియన్న, ఖమ్మం మరియు మహబూబాద్ జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారులు సురేష్, బి.వెంకన్న, రాజయ్య & పలువురు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# వడ్డీలు..పన్నుల్లో హేతుబద్ధత ఉండాలి !

ఆర్‌బిఐ ద్రవ్య పరపతి విధానం కారణంగా కొంత వెసులబాటు కలుగుతోంది. అయితే ఇది మరింతగా ప్రజలరు ఆదుకునేలా ఉండాలి. వడ్డీరేట్లు ప్రజలకు, వ్యాపారులకు, ఉద్యోగులకు అనువుగా ఉండాలి. వారు భరించేవిగా ఉండాలి. పన్నులు కూడా హేతుబద్ధంగా ఉండాలి. విపరీతంగా పన్నులు, వడ్డీలు వసూలు చేస్తే ప్రజలు భరించలేరని గుర్తించాలి. స్వయం ఉపాధి పొందే వారికి,చవువుకునే వారికి ఉపయుక్తంగా ఉండాలి. డబ్బు వినిమయం, వస్తు కొనుగోళ్లకు అవినాభావ సంబంధం ఉంది. డబ్బు మార్కెట్లో చలామణి అవుతూనే వస్తూత్పత్తి అన్నది ప్రజలకు చేరాలి. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా పరపతి విధానం ఉండాలి. అది ఇల్లు కావు, ఇతర పదార్థాలు కావచ్చు. అలాగే పెట్రో ధరలు, గ్యాస్ ధరలు కూడా ప్రజల కొనుగోలు శక్తికి మించి ఉండరాదు. ఇవి వస్తువుల ధరలు కూడా నియంత్రిస్తుంటాయి. వీటి ధరల ఆధారంగానే మార్కెట్లో వస్తువుల ధరలు పెరుగుతాయి. ఇవి బ్యాలెన్స్ చేయడం అన్నది ప్రభుత్వం నడిపిస్తున్న వారికి అవసరం. అదేపనిగా ఉచిత పథకాల కారణంగా సమాజంలో పనిచేసే వారు తగ్గిపోతున్నారు. తినికూర్చునే వారు పెరుగు తున్నారు. దీంతో వస్తూత్పత్తి కూడా తగ్గుతుంది. ఇది కూడా గమనవించాల్సి ఉంది.ఇకపోతే ధర పెరిగినంత మాత్రాన పెట్రోలు, డీజెల్, గ్యాస్ వినియోగాన్ని తగ్గించ లేము. కనుక వాటికోసం మనం వెచ్చించే మొత్తం పెరిగింది. ఐతే కార్మికుల, ఉద్యోగుల వేతనాలు మొత్తం మాత్రం పెరగడంలేదు. దీంతో మనం ఇతర వస్తువుల వినియోగాన్ని తగ్గించివేస్తున్నాం. ఇతర సరుకుల వినియోగం ఎప్పుడైతే తగ్గిందో, ఆ మేరకు ఆయా రంగాలలో మాంద్యం ఏర్పడుతుంది. దీనిని నివారించడానికి ప్రభుత్వం పూనుకోవాలి. కాని అలా జరగడం లేదు. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగి నప్పుడల్లా వాటిమీద వసూలు చేసే పన్నుల మొత్తం కూడా పెరుగుతోంది. ప్రస్తుత సంక్షోభాన్ని నివారించాలంటే ప్రజల కొనుగోలుశక్తిని పెంచే మార్గాలు అన్వేషించాలి. ఉపాధికల్పన మార్గాలను అన్వేషించాలి. కనీసం పెట్రో ఉత్పత్తుల మీద పన్నులను పెంచడం తగ్గిస్తే ప్రజల కొనుగోలుశక్తి పెరుగుతుంది. అప్పుడే ఆర్థికంగా నిలదొక్కుకోగలరు. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెట్రో ధరల పెరుగుదల వలన అదనపు ఆదాయం సమకూరుతోంది. ఆవిధంగా వచ్చిన అదనపు ఆదాయాన్ని ఉపాధి కల్పన వంటి రంగాలకు ఖర్చు చేయడం బదులు, కార్పొరేట్లకు మరిన్ని రాయితీల్విడానికో, వారి బకాయిలను మాఫీ చేయడానికో వినియోగిస్తోంది. అలాగే మరిన్ని ఉచిత పథకాలకు వెచ్చిస్తున్నారు. వాస్తవానికి మన దేశంలో పెట్రోలు ధరలో 45.5 శాతం, డీజిల్ ధరలో 39.8 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులకే పోతుంది. పన్ను రూపంలో వసూలు చేసేదానిలో కేంద్రం రాష్ట్రాలతో భాగం పంచుకోవాలి. అందుచేత మోడీ ప్రభుత్వం నేరుగా పన్ను రూపంలో కాకుండా స్పెషల్ డ్యూటీ, రోడ్ సెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్ వంటి పేర్లతో వసూలు చేస్తోంది. తరచూ ఆర్థిక మాంద్యం ఏర్పడడం వల్ల సరుకుల వినిమయం తగ్గిపోతుంది. అదే విధంగా ద్రవ్యోల్బణం పెరుగుతూ వుంటుంది. మన రూపాయి విలువ పడిపోయినా, సరుకుల ధరలు పెరిగినా అది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. దేశంలో ప్రస్తుతం నిరుద్యోగం 8 శాతం దాటింది. వీటికి తోడు మన దేశ వార్షిక జిడిపి వృద్ధి రేటు ముందు అంచనా వేసినట్టుగా ఉండడం లేదని తాజా అంచనాలు వెల్లడిస్తున్నాయి. ట్రంప్ విధానాలు, పాలస్తీనా,ఉక్రెయిన్ యుద్ధం ఆర్థిక వ్యవస్థమీద ప్రభావం చూపనున్నాయని అంటున్నారు. వృద్ధిరేటు తక్కువగా ఉండడం, ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం, నిరుద్యోగం తీవ్రంగా ఉండడం నేటి ఆర్థి దుస్థితికి తాజా ఉదాహరణాలు. ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. ఐతే మార్కెట్లమీద గుత్తాధిపత్యం కలిగివున్న బడా కార్పొరేట్లు ఆ పెరిగిన ధరలను వినియోగదారుల మీదకు నెట్టివేస్తున్నారు. ఇకపోతే పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగడం వలన దాని ప్రభావం రవాణా రంగం మీద పడుతుంది. దాని కారణంగా ఇతర సరుకుల ధరలు కూడా పెరుగుతాయి. ఇవన్నీ కలిసి ద్రవ్యోల్బణం పెరుగుతుంది. దీని పర్యవసానంగా శ్రామిక ప్రజల కొనుగోలుశక్తి తగ్గిపోతుంది. దానివలన సరుకుల వినియోగం తగ్గిపోతుంది. మార్కెట్ లోని సరుకులు చెల్లుబాటు కావు. అందువలన ఆర్థిక మాంద్యం ఏర్పడుతుంది. ఇకపోతే మనదగ్గర పంటలు బాగానే పండుతున్నాయి. మిర్చి, పప్పు ధాన్యాలు విపరీతంగా పండుతున్నాయి. వరి లెక్కకు మించి పండిస్తున్నారు. అయితే ఈ ధరలు ప్రజలకు చేరడం లేదు. తాజాగా ఆక్వా రైతులు ట్రంప్ దెబ్బకు విలవిల్లాడుతున్నారు. చికెన్, మటన్ ధరలు విపరీతంగా పెరుగుతున్నా ఆక్వా సామాన్యులకు అందుబాటు లోకి లేదు. దానిని ప్రజల చెంతకు తీసుకుని వెళ్లాల్సి ఉంది. ప్రజలకు మనదేశంలో లభిస్తున్న ఆహార ఉత్పత్తులు సరసమైన ధరలకు చేరాలి. ప్రధానంగా రొయ్యలను ఇంటింటికీ చేరుకునేలా చేయాలి. 140 కోట్లు జనాభా ఉన్న మనదేశంలో మాంసాహారులు కూడా ఎక్కువే. అమెరికా సుంకాలకు భయపడి కూర్చోకుండా ఆక్వాను ప్రజలకు అందించేలా ప్రణాళికలు చేయాలి. ఇకపోతే ట్రంపం సుంకాలను విమర్శిస్తున్న మనం ..మనవద్ద మోడీ సుంకాలను పట్టించుకోవడం లేదు. దేశం ఆర్థికంగా నిలదొక్కుకుని ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలంటే జీఎస్టీ వడ్డింపులు భారీగా తగ్గాలి. ఉచిత పథకాలను నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టాలి. తాయిలాలను పక్కన పెట్టాలి. కిలో రూపాయికే బియ్యం పథకానికి పాతరేయాలి. వడ్డీరేట్లు మరింతగా తగ్గాలి. విద్యార్థులు తీసుకునే విద్యారుణాలపై వడ్డీ నామమాత్రంగా ఉండేలా చూడాలి. ఇలా ఆలోచన చేసినప్పుడే, ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుంది. సంపాదించింది తిండికి కూడా సరిపోకపోతే దాని ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతుందని పాలకులు, వారికి సలహాలు ఇస్తున్న మేధావులు గుర్తించాలి.

# బాలుర వసతి గృహం అవసరమైన వసతుల కల్పన

: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

* **ఓదెల మండలంలో ఆకస్మికంగా తహసిల్దార్ కార్యాలయం, బీసీ బాలుర వసతి గృహం పరిశీలించిన జిల్లా కలెక్టర్**



ఓదెల, ఏప్రిల్ 09( సమయం న్యూస్) : బీసీ బాలుర వసతి గృహంలో అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఓదెల మండలంలో ఆకస్మికంగా తహసిల్దార్ కార్యాలయం, బీసీ బాలుర వసతి గృహం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, తహసిల్దార్ కార్యాలయంలో పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ధరణి దరఖాస్తుల పెండింగ్ ఉంచకుండా చూడాలని అన్నారు. బిసి బాలుర వసతి గృహంలో 9 లక్షల రూపాయలతో చేపట్టిన మౌలిక వసతుల కల్పన పనులు సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. వసతి గృహంలో డోర్స్, కిటికిలు, టాయిలెట్స్, విద్యుత్ మరమ్మత్తు పనులు, పేయింటింగ్ పనులు పూర్తి చేయాలని అన్నారు. వసతి గృహంలో షెడ్ నిర్మాణానికి ప్రతిపాదనలు అందించాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసిల్దార్ సునీత, ఏఈ జగదీష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







సీతంపేట మండల రేగులగూడ గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో సవర లక్ష్మణరావు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన తెలుసుకొని పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ వారి కుటుంబాన్ని పరామర్శించి వాళ్ళకి స్వయంగా కొంత ఆర్థిక సహాయం చేశారు. ప్రభుత్వం నుండి నష్ట పరిహారం రప్పించుటకు తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో AMC చైర్మన్ బిడ్డిక సంధ్యారాణి, తెలుగుదేశం సీతంపేట మండల పార్టీ అధ్యక్షుడు సవరతోట మోఖలింగం, ఐటీడీపీ కోఆర్డినేటర్ ఇమరక పవన్, జనసేన పార్టీ సీతంపేట మండల అధ్యక్షుడు మండంగి విశ్వనాధం, మరియు పాలకొండ నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు

*- సీతంపేట మండలం, సమయం న్యూస్*

# దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలది

* **ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి**

జనగాం ఏప్రిల్09( సమయం న్యూస్) : దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు పరిధిలోని చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. బుధవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్, ఘనపూర్ (స్టేషన్) మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ మారుజోడు రాంబాబు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ లతో కలిసి ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి దేవాదుల ఎత్తిపోతల పథకం కింద భూసేకరణ ప్రక్రియ, పెండింగ్ పనుల పురోగతి, సాగు నీటి సరఫరాపై నీటి పారుదల శాఖ అధికారులతో క్షుణ్ణంగా చర్చించి, సమీక్షించారు. ఈ సందర్భంగా ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు మాట్లాడుతూ.. దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినదని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారానే ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలోని ఏడు మండలాలకు సాగుకు నీరు అందుతోందని, యుద్ధప్రాతిపదికన దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన అని తెలిపారు. ప్రతి నెల సమీక్షిస్తూ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. మల్లన్నగండి లిఫ్ట్ 1, లిఫ్ట్2 పనులను జులై లోగా పూర్తిచేసి, సాగు నీరు అందించాలన్నారు. డిసెంబర్ లోపు అశ్వరావుపల్లి ప్రధాన కుడి కాలువ పనులు పూర్తి కావాలన్నారు. ఆర్ఎస్ ఘనపూర్ నుంచి నవాబ్ పేట ప్రధాన కాలువ సీసీ లైనింగ్ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. అన్ని డిస్ట్రిబ్యూటరీస్ లలో, మైనర్ కెనాల్స్ లలో గుర్రపుడెక్క, చెత్త చెదారాలను తొలగించాలని, కెనాల్ లను బలపర్చాలని, రెగ్యులేటర్స్, షెటర్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతం తీవ్రమైన కరువు ప్రాంతమని, దేవాదుల ప్రాజెక్టు చేపట్టిన తర్వాతనే సాగుకు, తాగు నీటికి ఇబ్బందులు లేవని వెల్లడించారు. దేవాదులకు సంబంధించి పెండింగ్ లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులందరూ సమన్వయంతో పెండింగ్ పనులన్నీ వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. నీటి నిర్వహణకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎస్డీసీలు సుహాసిని, హనుమాన్ నాయక్, ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, నీటి పారుదల శాఖ ఎస్ఈలు, ఈఈలు, డీఈలు, ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గ ఏజెన్సీ సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రం లోనే అదిలాబాద్ జిల్లాలో 9 రోజుల్లో

# ఇప్పటి వరకు 70 శాతం సన్నబియ్యం పంపిణీ

: **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్ ఏప్రిల్09( సమయం న్యూస్): సన్న బియ్యం లబ్దిదారుని ఇంట్లో భోజనం చేసిన జిల్లా పాలనాధికారి రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి సన్న బియ్యం పేదలకు వరం.. సన్న బియ్యం పంపిణీ తో పేద ప్రజలకు లబ్ది చేకూరుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం తలమడుగు మండలం ఝరి గ్రామం లోని ఓ ఇంటిలో ఉపేందర్ యాదవ్, కౌసల్య బాయి ఇంటిలో కుటుంబ సభ్యులతో కలసి భోజనం చేశారు. కుటుంబ సభ్యులను కలెక్టర్ సన్న బియ్యం గురించి బియ్యం ఎలా ఉన్నాయి, అన్నం రుచికరంగా ఉందా అడిగి తెలుసుకున్నారు. సన్న బియ్యం పంపిణీ తో మా కుటుంబం



సంతోషంగా ఉందని, అన్నం రుచికరంగా ఉందని, బియ్యం చాలా బాగున్నాయని , సన్న బియ్యం పథకం మా కుటుంబానికి ఎంతో.మేలు చేస్తుందని తెలిపారు. కడుపునిండా భోజనం చేస్తున్నామని ఎంతో మంది నిరుపేదలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతున్నదని, సన్న బియ్యం లభించడం మా అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. అధిక డబ్బులు వెచ్చించి బియ్యాన్ని బయట కొనుగోలు చేయకుండా ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. ఈ పథకాన్ని అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి , ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో 356 రేషన్ షాపులకు గాను 6 లక్షల 32 వేల రేషన్ కార్డులు ఉన్న లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందనీ ఏప్రిల్ 1వ తేదిన ప్రారంభించి ఈ రోజు వరకు ఇప్పటి వరకు తొమ్మిది రోజులలో 70 శాతం సన్నబియ్యం పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 4127 మెట్రిక్ టన్నుల బియ్యం, అదనంగా కొత్తగా 14,322 మంది చేరడం జరిగిందనీ ఆన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నాణ్యత గల సన్న బియ్యం పంపిణీ పై ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వాజిద్, సివిల్ సప్లై మేనేజర్ సుధా, mro రాజ్ మోహన్, drdo రవిందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దేశ ఐక్యత, సమగ్రతలను దెబ్బతీస్తున్న ప్రధాని మోడీ

- **డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి**

గజ్వేల్, ఏప్రిల్ 9: రాజ్యాంగంపై దాడి చేస్తూ దేశంలో విభజన వాదాన్ని పెంచి పోషిస్తూ ప్రధాని నరేంద్ర మోడి ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆరోపించారు. బుధవారం మాజీ కౌన్సిలర్ షహనాజ్ సమీర్ ఆధ్వర్యంలో గజ్వేల్ 13వ వార్డులో అంబేద్కర్, పూజ్య మహాత్మా గాంధీ చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించి అనంతరం రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న డిసిసి అధ్యక్షుడు నర్సారెడ్డి ప్రజలను ఉద్దేశించి



ప్రసంగించారు. ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న వారికి బుద్ధి చెప్పాలని, రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, దేశానికి స్వాతంత్రం తెచ్చిన మహాత్మా గాంధీని కూడా వారు విడిచి పెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా దేశంలో ఐక్యత, జాతీయ సమగ్రతను దెబ్బతీస్తున్న బిజెపి కులాలు, మతాలు, ప్రాంతాలు, వర్గాల పేరిట విడదీస్తూ రాజకీయ లబ్ధి పొందుతున్నట్లు స్పష్టం చేశారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ అంక్షారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్ రెడ్డి, యాదగిరి, డాక్టర్ వహీద్, నర్సింహ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొనగారి రాజు, కార్యదర్శి రాములు గౌడ్, నాయకులు గుంటుకు శ్రీనివాస్, అంజి యాదవ్, గాడిపల్లి శ్రీనివాస్, రమేష్ గౌడ్, సారిక శ్రీనివాస్ రెడ్డి, రాజు గౌడ్, నేత నాగరాజు, చెప్యాల శేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాచిగూడ లో టిఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం

అంబర్ పేట, ఏప్రిల్ 9, సమయం న్యూస్ : అంబర్ పేట ఎమ్మెల్యే శ్రీ కాలేరు వెంకటేష్ అధ్యక్షతన శుక్రవారం తేది 11 న సాయంత్రం 6:00 గంటలకు కాచిగూడ డివిజన్ నింబోలి అడ్డా లోని ఎ కె భవన్ లో బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. కాచిగూడ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎర్ర భీష్మాదేవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించబోయే విస్తృతస్థాయి సమావేశానికి మీడియా మిత్రులు,



బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, బూత్ కమిటీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.

# ఘనంగా కొనసాగుతున్న, సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు

- **నేడు విమాన రథోత్సవం..**
- **తరలిరానున్న భక్తజన సందోహం..**
- **ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు.**

దౌల్తాబాద్.ఎప్రిల్ 09.సమయం న్యూస్ : దౌల్తాబాద్ మండTలంలోని హిందూప్రియలో శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి అలంకరణ నిత్య పూజలు. యజ్ఞం. గరుడ సేవ తదితర కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త



అన్నా రెడ్డి సుభాష్ రెడ్డి దంపతులు నిర్వహించారు. కాగా బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన రథోత్సవ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. రథాన్ని రంగురంగులతో అందంగా అలంకరించారు. రాత్రి నుంచి ఉదయం వరకు పూల మాలలతో అందంగా అలంకరించి స్వామివారి ఉత్సవ విగ్రహాలను అందులో ఉంచి ఊరేగించడం ఆనవాయితీగా వస్తుంది. రథోత్సవం పురవీధులు తిరుగుతున్న సందర్భంగా గ్రామంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఇప్పటికే గ్రామానికి చేరుకున్నారు. గురువారం ఉదయం వేద బ్రాహ్మణ పండితుల మంత్రో చ్చరణ మధ్య భక్తుల కేరింతల మధ్య రథోత్సవం కొన సాగుతుంది.



## గుమ్మడిదల తహసిల్దార్ ను కలిసిన నాయకులు

గుమ్మడిదల ఏప్రిల్ 9 (సమయం న్యూస్): మండల కేంద్రమైన గుమ్మడిదల లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసిల్దార్ పరమేశం ను గుమ్మడిదల మాజీ సర్పంచ్ చిమ్మల నరసింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలువాతో సన్మానించారు, గ్రామంలోని స్థితిగతులను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రకాష్ రెడ్డి, సత్యనారాయణ, కృష్ణారెడ్డి ,భాస్కర్ రెడ్డి, బాల్ రెడ్డి ,బిక్షపతి రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

# రేషన్ షాపులను కాంగ్రెస్ పార్టీ ఆఫీసులుగా మార్చారు

: **ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి**

నర్సాపూర్ ఏప్రిల్ 09, (సమయం న్యూస్) : నర్సాపూర్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు రేషన్ షాప్ ల దగ్గర కాంగ్రెస్ ఫ్లెక్సీలను పెట్టి వాటిని కాంగ్రెస్ ఆఫీసులుగా మార్చారని ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి ఆరోపించారు, సన్న బియ్యం పంపిణీ పేరుతో రేషన్ షాపు ల దగ్గర కాంగ్రెస్ ఫ్లెక్సీలు రాజకీయం చేయడం మంచిది కాదని కాంగ్రెస్ నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ,సన్నబియ్యం లో నూకలు వాటితోపాటు దొడ్డు బియ్యం వస్తున్నాయని ప్రజాపథంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని సునితారెడ్డి డిమాండ్ చేశారు, కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని వడ్ల కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని కేంద్రాలలో అన్ని సదుపాయాలు కల్పించాలని ,వడ్లు వెంటనే తూకం వేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బల్దియా మాజీ అధ్యక్షులు అశోక్ గౌడ్ ,పట్టణ పార్టీ అధ్యక్షులు పంబాల బిక్షపతి, తంగేడు



పల్లి ఆంజనేయులు,ప్రసాద్, తొంట వినయ్,సద్దాం సాయి సమీర్ సాకేత్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు

## మర్కుక్ రేషన్ షాప్ లో బియ్యం బస్తాలో ఎలుక

- **య్యం పంపిణీకి బస్తా తెరిచేసరికి చనిపోయి దర్శనమిచ్చిన ఎలుక**
- **రైస్ మిల్లర్ల నిర్లక్ష్యంతో ప్రాణ సంకటంగా మారిన రేషన్ బియ్యం**

గజ్వేల్, ఏప్రిల్ 9: రేషన్ బియ్యం ద్వారా పేదల ఆకలి తీర్చుతున్న ప్రభుత్వ లక్ష్యాన్ని రైస్ మిల్లర్ల నిర్లక్ష్యం నీరుగారుస్తుంది. బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం లోని మర్కుక్ మండల కేంద్రంలో రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీ చేద్దామని రేషన్ డీలర్ బస్తా తెరువగా అందులో చనిపోయిన ఎలుక దర్శనమిచ్చింది. దీంతో బియ్యం కోసం వచ్చిన విని



యోగదారులు భయాందోళనకు గురయ్యారు. ఆ బియ్యం మాకొద్దంటూ చెప్పడంతో ఆ బస్తా పక్కన పెట్టి వేరే బస్తాండ్ నుండి డీలర్ బియ్యం పంపిణీ చేశాడు.

# కొనుగోలు కేంద్రాలలో నాణ్యమైన ధాన్యం విక్రయించి రైతులు బోనస్ పొందాలి..

- **కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి...**
- **జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు**

సూర్యాపేట ఏప్రిల్ (సమయం న్యూస్): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తేమ శాతం 17 ఉండేలా తాలు లేకుండా నాణ్యమైన ధాన్యం తీసుకొనివచ్చి మద్దతు ధర రూ. 2320 పై భోనస్ రూ. 300 పొందాలని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు అన్నారు.బుధవారం సూర్యాపేట మండలం పరిధిలోని పిల్లలమర్రి, రాజ్ నాయక్ తండా, బాలేంల 1 ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు



కలెక్టర్ పి రాంబాబు సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, టెంట్ లాంటి మౌళిక వసతులు ఏర్పాటు చేయాలని, గోనె సంచులు తెచ్చుకోవాలని నిర్వాహకులకి సూచించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలకి వచ్చిన ప్రకారం రైతులకి టోకెన్ లు జారీ చేయాలని వడ్లలో తాలు లేకుండా ఆరబెట్టించి తేమ శాతం 17 రాగానే తూకం వేసి ధాన్యం మిల్లులుకి తరలించాలని సూచించారు.రాజ్ నాయక్ తండా కొనుగోలు కేంద్రంలో వడ్లను ఆరబెట్టేందుకు ట్రాక్టర్ ని ఉపయోగిస్తున్నందంగా అదనపు కలెక్టర్ చూసి అలా ట్రాక్టర్ ఉపయోగిస్తే వడ్లు విరిగి బియ్యం, నూకగా మారుతాయని అలా చేయరాదని నిర్వాహకులని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం సూచించిన ప్రాంతాలలో మాత్రమే కొనుగోలు కేంద్రాలు నిర్వహించాలని వాటికి ఉప కేంద్రాలు ఏర్పాటు చేయరాదని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆర్ ఐ గోపి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వెంకటమ్మ, నాగరాజు, బాలాజీ, దేవి తదితరులు పాల్గొన్నారు.



## కానుకుంట గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి

గుమ్మడిదల ఏప్రిల్ 9 (సమయం న్యూస్): గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలోని బృందావన్ గార్డెన్స్ వ్యవస్థాపకుడు గూడూరు రిషి కుమార్ రెడ్డిని యువజన సంఘాల అధ్యక్షులు సోమోల యాదగిరి, గ్రామ యువకులు కలసి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు అత్యవసరమని ,వాటిని మీరు ఏర్పాటు చేయాలని వారిని కోరడం జరిగింది. దానికి వారు సానుకూలంగా స్పందించి,గ్రామంలోని పుర వీధుల్లో, ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు త్వరలోనే ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో చౌదరి శ్రీనివాస్ రెడ్డి ,ఇప్ప పెంటారెడ్డి, కుమ్మరి వెంకటేష్, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి , పోతురాజు సుధాకర్, ఊట్ల కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అడిగిన వెంటనే పెద్ద మనసుతో సీసీ కెమెరాలు ఏర్పాటుకు హామీ ఇచ్చిన రిషి కుమార్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

# టీటీడీ టికెట్లు వాట్సాప్‌లో ఇలా చిటికెలో బుక్ చేసుకోండి.. స్టెప్ బై స్టెప్..

ఆంధ్రప్రదేశ్ సర్కారు వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభించి అనేక రకాల సేవలను అందిస్తున్న విషయం తెలిసిందే. క్రమంగా మరిన్ని సేవలను ఇందులో చేర్చుతున్నారు. తాజాగా, టీటీడీకి సంబంధించి నాలుగు సేవలను వాట్సాప్ గవర్నెన్స్‌లో అందుబాటులోకి తెచ్చారు. స్లాటెడ్ సర్వదర్శన టోకెన్ సెంటర్స్ సమాచారంతో పాటు ప్రస్తుతం ఎన్ని టికెట్లు అందుబాటులో ఉన్నాయి? సర్వదర్శనం క్యూలైన్ ఏ మేరకు ఉంది? శ్రీవారి దర్శనానికి ఎన్ని గంటలు పడుతోంది? శ్రీవాణి టికెట్లకు సంబంధించిన సమాచారం వంటివి దీని ద్వారా భక్తులు తెలుసుకోవచ్చు. రూమ్స్ కోసం డిపాజిట్ రీఫండ్ వివరాల వంటి సమాచారం కూడా అందుకోవచ్చు.

- **టికెట్లు ఇలా బుక్ చేసుకోవచ్చు..**

>> 9552300009 వాట్సాప్ నంబర్‌ను మీ మొబైల్‌లో సేవ్ చేసుకోండి.

>> వాట్సాప్ తెరిచి ఆ నంబర్‌కు "హాయ్" మెసేజ్ పంపండి.

>> మీకు కావాల్సిన సేవలను ఎంచుకోండి

>> అందుబాటులో ఉన్న ఆప్షన్ల నుంచి "ఆలయ బుకింగ్ సేవలు" ఎంచుకోండి.

>> దర్శన టిక్కెట్లు, సేవా రిజర్వేషన్లు, వసతి, ఇతర సేవలను బుక్ చేసుకోవడానికి చాట్‌బాట్ సూచనలు ఇస్తుంది.

>> స్లాటెడ్ సర్వదర్శనంతో పాటు సర్వదర్శనం, శ్రీవాణి కౌంటర్ స్టేటస్ డిపాజిట్ రీఫండ్ లైవ్ స్టేటస్ ఆప్షన్లు ఉంటాయి.

>> వాట్సాప్‌లో బుకింగ్ వివరాలను అందుకుంటారు. దాన్ని డౌన్‌లోడ్ చేసి ప్రింట్ తీసుకోండి.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
www.samayamdaily.net



# బీసీలు సంఘటిత ఉద్యమాలకు సిద్ధం కావాలి

* **అసెంబ్లీలో జ్యోతి బాపూలే విగ్రహ ఏర్పాటుకు ఈనెల 11 లోపు సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలి**

గజ్వేల్,ఏప్రిల్ 9: బీసీలు సంఘటిత ఉద్యమాలకు సిద్ధమై హక్కులు సాధించుకుందామని రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు, బిఆర్ఎస్ లీగల్ సెల్ నేత కొట్టాల యాదగిరి ముదిరాజ్ పిలుపునిచ్చారు . బుధవారం గజ్వేల్ లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన



సర్వాయి పాపన్న, పండగ సాయన్న, కొరివి కృష్ణ స్వామిల స్ఫూర్తితో ఉద్యమించి కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ మేరకు పార్లమెంటులో 42 శాతం బిల్లు ఆమోదించే వరకు తెలంగాణ తెగింపును ప్రదర్శిస్తామన్నారు. ఈనెల 11వ తేదీలోపు సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఆవరణలో జ్యోతిబాపూలే విగ్రహ ప్రతిష్ట ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అభివృద్ధికి అట్టడుగున నిలిచిన వెనుకబడిన వర్గాలు ఎమ్మెల్సీ కవిత నేతృత్వంలో ఉద్యమించి హక్కుల సాధనలో చారిత్రాత్మక నిర్ణయాలను సొంతం చేసుకుందామని చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుండి అణగారిన, వెనుకబడిన వర్గాల కోసం కెసిఆర్ ఎన్నో కలలు కనగా, వాటిని నిజం చేసుకునే బాధ్యత మనపై ఉందన్నారు. 2017లో బీసీలకు 37 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అసెంబ్లీలో బిల్లు ఆమోదింపజేసిన కెసిఆర్ చిత్తశుద్ధిని మర్చిపోవద్దన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన యువత కడుపులు ఎండి సమైక్యవాదుల కుట్రలకు మండి తెలంగాణ ఉద్యమాలకు ఊపిరి పోసినట్లు గుర్తు చేశారు. పాలకులు బీసీలను మభ్యపెట్టడం కాకుండా ఇచ్చిన హామీల అమలుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని, లేనిపక్షంలో ఎమ్మెల్సీ కవిత నేతృత్వంలో ఉద్యమాలకు ఊపిరి పోసి హక్కులు సాధించుకుంటామని వివరించారు.

### ఈ నెల 26 జరుగు

## జాబ్ మేళా విజయవంతానికి సన్నాహక సమావేశం

* **పాల్గొన్న శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు.**

జయశంకర్ భూపాల్ పల్లి ఏప్రిల్ 09 ( సమయం న్యూస్) : నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే ద్యేయంగా మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, జాబ్ మేళా నిర్వహించే టాస్క్ కంపెనీ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి ఈ నెల 26 న నిర్వహించే మెగా జాబ్ మేళా కార్యక్రమ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో టాస్క్ కంపెనీ నిర్వహిస్తున్న జాబ్ మేళా లో ప్రముఖ కంపెనీలు పాల్గొంటు న్నట్లు తెలిపారు. 700 కంపెనీలు పాల్గొంటున్న ఈ జాబ్ మేళా లో 10 వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 26వ తేదీన నిర్వహించే జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు ఈ జాబ్ మేళా కార్యక్రమంపై గ్రామ గ్రామాన విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈనెల 26 వ తేదీన జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించే జాబ్ మేళా కు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు హాజరవుతారని తెల్పారు. క్యూ ఆర్ కోడ్ లో దరఖాస్తు ఉంటుందని విద్యార్హతలు ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. క్యూ ఆర్ కోడ్ లో రిజిస్ట్రేషన్ చేయించుకొని వారు 26వ తేదీన నిర్బహించే జాబ్ మేళా స్టాళ్లలో నమోదు చేసుకోవాలని తెలిపారు. 10 వతరగతి నుండి డిగ్రీలు, పిజీలు ఇతర పై చదువులు చదువుకున్న నిరుద్యోగ యువత కు గొప్ప అవకాశమని అన్నారు. మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు, పోలీస్ శాఖ సమన్వయంతో అవగాహన కల్పించాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని అత్యవసర వైద్య కేంద్రం ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. మందులు, ఓ ఆర్ ఎస్ అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతి, యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా మెగా జాబ్



మేళా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జాబ్ మేళా కార్యక్రమపై గ్రామ స్థాయిలో అధికారులు నిరుద్యోగ యువతను గుర్తించి వారి పూర్తి బయో డేటా నివేదిక తయారు చేయాలని తెలిపారు. అట్టి జాభితా మేరకు అర్హతలు బట్టి వారికి అవకాశాలు కల్పనకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. జాబ్ మేళా రిజిస్ట్రేషన్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూ ఆర్ కోడ్ పై యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్ జాబ్ మేళాలో నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొనేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అదే రోజున నియమక ఉత్తర్వులు జారీ చేస్తారని తెలిపారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ నిరుద్యోగ ఈ జాబ్ మేళాలో ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెడు వ్యసనాలకు బానిస కాకుండా యువత కు ఈ జాబ్ మేళా ద్వారా ఉపాధి లభిస్తుందని తెలిపారు. దూరం అని కాకుండా ఎక్కడ అవకాశం వస్తే ఆ జిల్లాకు వెళ్లాలని, నేను కలెక్టర్ ఇతర రాష్ట్రాల నుండి వచ్చి ఇక్కడ ఉద్యోగం చేస్తున్నామని అన్నారు. యువతి ,యువకులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ శాఖ ద్వారా కూడా పెద్ద ఎత్తున జాబ్ మేళా పై ప్రచారం కల్పిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కేటీపీఎస్ సీఈ శ్రీ ప్రకాష్, సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రఘు, టాస్క్ ప్రతినిధి ప్రదీప్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఎంపిడివోలు తదితరులు పాల్గొన్నారు.



## పోషణ పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

* **అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం పెరగాలి**
* **కేంద్రాలలో సిడిపిఓలు, సూపర్వైజర్లు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలి**
* **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

హైదరాబాద్, ఎప్రిల్ 09 (సమయం న్యూస్) ; పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించడంతో పాటు అంగన్వాడి కేంద్రాల పై నమ్మకం కలిగేలా అంగన్వాడి టీచర్లు పనిచేసి హైదరాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి ఐ సి డి ఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ పథకాలపై మహిళా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు తో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలకు అత్యధికంగా పిల్లలు హాజరయ్యేలా చూడడంతో పాటు వారికి పోషక విలువలు ఉన్న ఆహారం, మెరుగైన సేవలు అందించి అంగన్వాడి కేంద్రాలపై నమ్మకం కలిగేలా చూడాలని, హైదరాబాద్ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. లక్ష్యం మేరకు ప్రతి సూపర్వైజర్ నెలకు 15 సెంటర్లను, సిడిపిఓ 10 సెంటర్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాలకు పిల్లలు, గర్భిణీలు వచ్చేలా చూడాలని, కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం తక్కువగా ఉన్న అంగన్వాడి టీచర్లు తమ పనితీరులు మెరుగుపరుచుకోవాలని కేంద్రాలకు వచ్చే పిల్లల్లో ఆరోగ్యరీత్యా నాణ్యమైన పోషక విలువల గల ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. రాష్ట్రంలో అన్ని అంశాల్లో 80% ఉందని కేంద్రాలకు వచ్చే పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు ఇంకా మెరుగైన సేవలు అందించి 95 శాతం వరకు పెంచాలని ప్రతి సెగ్మెంట్ క్రింది నుండి ఐదవ స్థానంలో ఉన్న అంగన్వాడి టీచర్లకు మెమోలు జారీ చేయాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాలపై నమ్మకం కలిగేలా పనిచేసి హైదరాబాద్ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శవంతమైన జిల్లా గా తీర్చిదిద్దాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో మరుగుదొడ్లు నిర్మాణాలకు అనుమతులు తీసుకోవాలని, విద్యుత్ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియాతో పాటు మరికొన్ని అంగన్వాడీలలో పిల్లల హాజరు శాతం పెంచాలని లేనియెడల సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు వచ్చిన ఫోక్సో కేసులకు సంబంధించి ఇంకా ఎంత చెల్లించవలసి ఉన్నదని కలెక్టర్ తెలుసుకున్నారు. హైదరాబాద్ జిల్లాలోని సీసీఐ, శిశు విహార్, అన్ని అంగన్వాడి కేంద్రాలలోని 05 సంవత్సరాలలోపు పిల్లలకు ఆర్ బి ఎస్ కే వైద్యులచే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆరోగ్యరీత్యా వివిధ రకాల టీకాలు అందించాలని అలాగే పుట్టుక లోపాలు, ఎదుగుదల లోపాలు, అనుకున్నదాని కంటే ఎక్కువ బరువుతో పాటు వివిధ సమస్యలతో బాధ పడుతున్న వారికి గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. స్లామ్ఏరియాలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అల్పాహారం అందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో నివేదికలను ఆన్లైన్ ద్వారా పంపాలని సూచించారు. తదుపరి అంగన్ వాడి కేంద్రాల నిర్వహణ, శిశు విహార్, చిల్రన్ హోమ్, రెస్క్యూ హోం అలాగే సఖి కేంద్రం నిర్వహణ, పోస్కో చట్టం అమలు, భేటీ బచావో బేటి పడావో, హెల్ప్ లైన్ నిర్వహణ జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా సమీక్షించారు. ఈ సందర్భంగా పోషణ పక్షం గోడపత్రికను ఆవిష్కరించి పోషణ పక్షం వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆ దిశగా అనుబంధ శాఖల అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. డిడబ్ల్యూవో అక్కేశ్వరరావు, డి ఐ ఓ డాక్టర్ శ్రీధర్, సిడిపివోలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు



## ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సునీతా లక్ష్మారెడ్డి

నర్సాపూర్ ఏప్రిల్ 9, (సమయం న్యూస్) : నర్సాపూర్ పట్టణ పీ. బి.వి. ఆర్ టి కాలేజ్ సమీపంలో నూతనంగా ఏర్పడిన ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్ ప్రారంభించారు, ముఖ్యఅతిథిగా సునీతా లక్ష్మారెడ్డి పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు కన్వెన్షన్ నిర్వాహకులు సంతోష్ కుమార్ ఎమ్మెల్యే సునీతా రెడ్డిని శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో బా రా సా శ్రేణులు అశోక్ గౌడ్, మన్సూర్, కురుమ శ్రీశైలం, నర్సింగరావు ,పంబాల బిక్షపతి, జితేందర్ రెడ్డి, సేనాధిపతి, కరుణాకర్ , సూరారం నర్సింలు, ఆంజనేయులు, వినయ్, సద్దాం చింత స్వామి సార. మాణిక్యం శ్ రాజా గౌడ్, నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధులు హాజరుకావడం జరిగింది



## ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే

గుమ్మడిదల, ఏప్రిల్ 9 (సమయం న్యూస్) : ఆపత్కాలంలో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మున్సిపాలిటీకి చెందిన హంసమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.4 లక్షల విలువైన ఎల్ఓసి ని ఆమె కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందచేశారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.



## అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక సందర్శన

కరీంనగర్ ఏప్రిల్ 9 సమయం న్యూస్ : కరీంనగర్ మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పరిధిలోని భగత్ నగర్ లో గల జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయం హాజరు రిజిస్టర్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. శాఖ పరిధిలోని వివిధ ప్రభుత్వ పథకాల అమలులో సిబ్బంది తీసుకుంటున్న చర్యలను గురించి ప్రశ్నించారు. జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయ పరిధిలోని చైల్డ్ హెల్ప్ లైన్, మిషన్ వాత్సల్య, మహిళా సాధికారత విభాగాలకు సంబంధించి పలు రిజిస్టర్లను పరిశీలించారు. సెక్షన్ ఇన్చార్జీలు, విభాగాల బాధ్యులు ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని, పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా సంక్షేమ అధికారి సబిత, డీసీపీవో పర్వీన్ ఉన్నారు.




## ప్రభుత్వ పాఠశాలకు పరిశ్రమ సహకారం

జిన్నారం, ఏప్రిల్ 9 (సమయం న్యూస్) : సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం ఐడీఏ బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు స్థానిక సాయి లైఫ్ సైన్స్ పరిశ్రమ సహకారం అందించింది. రూ .45 వేల విలువైన నోట్ పుస్తకాలు, ఇతర విద్యా సామాగ్రిని జ్ విద్యార్థులకు పరిశ్రమ ప్రతినిధులు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ సీనియర్ మేనేజర్ కేఆర్కె రాజు, ప్రధానోపాధ్యాయులు అంజయ్య, రిటైర్డ్ హెచ్ఎమ్ శశిధర్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక



# వాటర్ షెడ్ యాత్ర మొబైల్ వాహనం ప్రారంభం

* **చెక్ డ్యాం నిర్మాణం కొరకు భూమి పూజ:**
* **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్ ఏప్రిల్ 09 (సమయం న్యూస్) : బుధవారం తలమడుగు మండలం ఝరి గ్రామంలో ప్రధానమంత్రి కృషి సించాయి యోజన 2.0 వాటర్ షెడ్ పథకం లో భాగంగా వాటర్ షెడ్ యాత్ర మొబైల్ వాహనాన్ని ప్రారంభించి శివాలయం లో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చెక్ డ్యామ్ నిర్మాణం కొరకు భూమి పూజ చేసి ఇందిరా పథకం కింద ఉపాధి పొందుతున్న వివిధ రకాల స్వయం ఉపాధి లో చేపడుతున్న వాటిని పరిశీలించి ప్రధాన మంత్రి సందేశాన్ని విని, గ్రామస్తుల నుద్దేశించి జిల్లా పాలనాధికారి రాజర్షి షా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపడుతున్న వాటర్ షెడ్ యాత్ర జిల్లాలో రెండు మండలాలు నార్నూర్, తలమడుగు మండలాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందనీ అన్నారు. ఈ సందర్భంగా తలమడుగు మండలం లోని ఆరు గ్రామాల నుండి పల్సికే, డొర్లి, ఉమ్రి, కొత్తూర్, కప్పర దేవి, ఝరి గ్రామాలు ఎంపిక చేయడం జరిగిందని, ఆరు గ్రామాల నుండి గ్రామస్తులు ఇక్కడికి రావడం జరిగిందనీ అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలాలు అడుగంటి పోకుండా వాన నీటిని సంరక్షించి భూగర్భజలాలను పెంచడమే వాటర్ షెడ్ యాత్ర పథకం ముఖ్య ఉద్దేశమని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా నీటి సంరక్షణ ప్రాధాన్యత పై గ్రామంలో విద్యార్థులు, అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించడం జరిగిందని అన్నారు. గ్రూప్ సభ్యులకు ఆరు గ్రామాల్లో 309 మందికి 50 వేల రూపాయల చొప్పున మంజూరు చేయడం జరిగిందనీ అన్నారు. వాతావరణ సమతుల్యత నీటి సంరక్షణ మాత్రమే కాకుండా పర్యావరణ పరిరక్షణ కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు. మొక్కలు నాటడం ద్వారా వాతావరణ సమతుల్యత సాధించవచ్చన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. నీటి సంరక్షణ, ప్రాథమిక భూసారం పెంపొందించి వ్యవసాయాన్ని మెరుగు పరిచే లక్ష్యంగా వాటర్ షెడ్ ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లడం ఎంతో అవసరమన్నారు. మహిళా సంఘాల గ్రూప్ లో లేనివారు తప్పకుండా గ్రూప్ లో చేరి లబ్ధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ రవీందర్, తహసిల్దార్ రాజ్ మోహన్, ఎంపిడిఓ,పటేల్, మండల సమైఖ్య అధ్యక్షురాలు ప్రమీల, తదితరులు పాల్గొన్నారు



## టోల్ ప్లాజా నిర్వాహకులు సి ఎస్ ఆర్ పద్ధతి లో అంబులెన్స్ ఏర్పాటు

నిజామాబాద్ ఏప్రిల్ 09 (సమయం న్యూస్) : ఈరోజు అథాంగ్ టోల్ ప్లాజా వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) కింద నిజామాబాదు జిల్లా మెడికల్ మరియు హెల్త్ డిపార్ట్మెంట్ వారికి 30 లక్షల విలువ చేసే అంబులెన్సు వాహనమును జిల్లా కలెక్టర్ గారి అద్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అందచేయడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గారు మాట్లాడుతూ ఇట్టి అంబులెన్సు జిల్లా ప్రజలకి ఉపయోగ పడేలా వినియోగించుకోవాలని DMHO గారికి తెలిపినారు . వీరి విధంగా మరిన్ని కంపెనీలు ముందుకు వచ్చి CSR కింద ప్రజలకి ఉపయోగపడేలా కార్యక్రమాలు చేయాలని తెలిపినారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంత్ IAS గారు , జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వర్ గారు, జిల్లా ఆరోగ్య శాఖా అధికారి రాజశ్రీ గారు , జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారి మధు గారు, ఐరాడ్ మేనేజర్ వర్ష గారు , టోల్ గేట్ మేనేజర్ అనిల్ గారు మరియు వారి సిబ్బంది విరాజ్ గారు , సతీష్ గారు , తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్లు, ఎలక్ట్రానిక్ స్కూటీ లు పంపిణీ చేసిన కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాల్ పల్లి ఏప్రిల్ (సమయం న్యూస్) : మారుమూల ప్రాంతాల్లో అంగన్ వాడి సిబ్బంది సేవలకు, రైతులకు ఉపయోగపడే డ్రోన్లు, వైద్య సేవల పరికరాలు జిల్లా ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడతాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఈసీఐఎల్ కంపెనీ సిఎస్ఆర్ నిధులు నుండి 20 ఎలక్ట్రానిక్ స్కూటీలు, 12 డ్రోన్ల పంపిణీ చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్ వాడి సూపర్ వైజర్లు మారుమూల గ్రామాల్లో.సేవలు అందించడానికి, వ్యవసాయంలో డ్రోన్లు వినియోగం,వైద్య సేవలు సిటీ స్కాన్, ఇతర పరికరాలు ఈసిఐఎల్ సి ఎస్ ఆర్ నిధులు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతాలకు అంగన్వాడి సూపర్ వైజర్లు వెళ్ళడానికి రవాణా సౌకర్యాలు లేవని ఎలక్ట్రానిక్ స్కూటీలు కుగ్రామానికి సైతం సులువుగా వెళ్ళడానికి ఉపయోగ పడతాయని తెలిపారు. ఈ రోజుల్లో వ్యవసాయ పనులకు కూలీలు కొరత ఉందని, ఈ ఆధునిక సాంకేతికత డ్రోన్లు వినియోగం రైతులకు చాలా ఉపయోగమని అన్నారు. రసాయన మందులు పిచికారీ సమయంలో ప్రజలు ప్రాణాలకు అపాయం ఏర్పడుతుందని, డ్రోన్లు వినియోగం ద్వారా ప్రాణాలకు ఎలాంటి అపాయం ఏర్పడదని, సమయం కూడా ఆదా అవుతుందని తెలిపారు. అలాగే జిల్లా ప్రధాన ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలకు సిటీ స్కాన్ ఇతర పరికరాలు ఇవ్వనున్నారని తెలిపారు. రానున్న నెల రోజుల్లో వైద్య పరికరాలు ఏర్పాటు జరుగుతుందిని తెలిపారు. సిఐఎల్ సి అండ్ ఎండి అనురాగ్ కుమార్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ స్కూటీ లు, డ్రోన్లు, వైద్య పరికరాలు మొత్తం 4 కోట్ల సి ఎస్ ఆర్ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. స్కూటీలు, డ్రోన్లు వినియోగం వల్ల అంగన్వాడీ సేవలకు, రైతులకు ఉపయోగకరమని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సీపీఓ బాబు రావు, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, వ్యవసాయ అధికారి వీరు నాయక్, ఆసుపత్రి పర్యవేక్షకులు డా నవీన్ కుమార్, ఈసిఐఎల్ హెచ్ ఆర్ ఈడీ మురళీధర్, సీఎంఓ వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.



## పోషణ పక్షం గోడ ప్రతులను ఆవిష్కరించిన కలెక్టర్ విజయేంద్రబోయి

మహబూబ్ నగర్ ఏప్రిల్ 09 (సమయం న్యూస్) : పోషణ పక్షం గోడప్రతులను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి జిల్లా కలెక్టర్ కార్యాలయం లో తన ఛాంబర్ లో బుధవారం ఆవిష్కరించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంపూర్ణ పోషకాహారం అందించే దిశగా పోషణ పక్షం ఏప్రిల్ 8 నుండి 22 వరకు పోషణ అభియాస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు ముఖ్యంగా పోషకాహార లోపం అధిగమించడానికి గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ లబ్దిదారులతో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపు నిచ్చారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం మాట్లాడుతూ ఈ పోషణ పక్షం ప్రతిపాదిత నేపధ్యాలు వివరించారు

# ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం గ్రౌండింగ్ వేగవంతం చేయండి

* **జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి.**



**మహబూబ్ నగర్ ఏప్రిల్ 09, (సమయం న్యూస్) :** మహబూబ్ నగర్ రూరల్ మండలం పోతన్ పల్లి గ్రామంలో బుధవారం ఇందిరమ్మ గృహం మంజూరైన సూర్య కళ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కు కలెక్టర్ భూమి పూజ చేశారు.గ్రామం లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు పరిశీలించారు. పోతన్ పల్లి లో మొత్తం 129 లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు అయినట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు సూర్య కళను ఇంటి నిర్మాణం గురించి అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం మంజూరైనందుకు చాలా ఆనందంగా ఉందని తెలిపారు గ్రామం లో ఇందిరమ్మ లబ్ధిదారులతో మాట్లాడి అందరికీ ఇండ్లు మంజూరైనవా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామం లో స్వయం సహాయక మహిళా సంఘం లో సభ్యులుగా ఉన్నారా అని అడిగారు. మీకు ఏమైనా ఇబ్బంది ఉంటే మహిళా సంఘం తోడుగా ఉంటుందని అని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు కట్టడానికి ఎంత ఖర్చు వస్తుంది అని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ప్రతి ఒక్కరూ బేస్మెంట్, చెత్తు, ప్లాస్టింగ్ కి ఎంత ఖర్చు వస్తుంది అని ప్రతి ఒక్కరు తెలుసుకొని అవగాహన కలిగి ఉండాలని, వీటి పైన మీకు అవగాహన ఉండాలని వివరించారు. అక్కడనుండి హమాలి శివమ్మ ఇంటి దగ్గరికి వచ్చి మీకు బేస్ మెంట్ కావడానికి ఎంత ఖర్చు వచ్చిందని అడిగింది. అధికారులు నిత్యం పరిశీలించి లబ్ధిదారులను ఇండ్లు నిర్మాణం చేసుకునేలా లబ్ధి దారులను ప్రోత్సహించాలని, తక్కువ ఖర్చుతో ఇంటి నిర్మాణం కట్టే విధంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కు బేస్ మెంట్ కొరకు గుర్తించిన 12 మంది నిరు పేద మహిళలకు లక్ష రూ. ల బ్రిడ్జి లోన్ మంజూరు చేయాలని డి.ఆర్.డి. ఓ,ఎల్.డి.ఎం.లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పై మాసన్లకు,లబ్ధి దారులకు శిక్షణ గ్రామం లో నిర్వహించాలని గృహ నిర్మాణ పి.డి ని ఆదేశించారు. లబ్ధి దారులకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకుని రావాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ పి.డి.వైద్యం భాస్కర్, డిఆర్డిఓ నరసింహులు, లీడ్ బ్యాంకు మేనేజర్ భాస్కర్ ,తహశీల్దార్ సుందర్ రాజ్,ఎం.పి.డి. ఓ కరుణ శ్రీ సంబంధిత అధికారులు లబ్ధిదారులు పాల్గొన్నారు.



## బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

* **జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ ఏప్రిల్ (సమయం న్యూస్) :** బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బాలశక్తి కార్యక్రమం అమలు తీరుపై విద్య, వైద్య, సంక్షేమ శాఖల అధికారులతో ఆమె జూమ్ కాల్ మాధ్యమం ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలశక్తి కార్యక్రమాన్నీ పక్కాగా అమలు చేయాలనీ ఆదేశించారు. విద్యార్థులందరికీ దశలవారీగా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ సమగ్ర ఆరోగ్య కార్డులను తయారు చేయాలని సూచించారు. వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్య స్థితిగతుల వివరాలు, అవసరమైన ప్రత్యేక పోషక ఆహారం, మందులను వారి పోషకులకు అందజేయాలని ఆదేశించారు. విద్య, వైద్యం, ఆర్థిక అక్షరాస్యతకు సంబంధించి విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేలా క్విజ్ పోటీలను నిర్వహించాలన్నారు. వేసవి సెలవులలో విద్యార్థులకు జీవితంలో ఉపయోగపడే పలు కోర్సులను నేర్చుకునే విధంగా ప్రోత్సహించాలని, ప్రత్యేక వేసవి శిబిరాలను నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఈఓ పి. రామారావు, విద్యశాఖ అధికారులు సలోమి కరుణ, లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

# మన అందరి లక్ష్యం ఒక్కటే కావాలి : ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

* **మహబూబ్ నగర్ విద్యా నిధికి భారీ విరాళం ఇచ్చిన మహబూబ్ నగర్ TNGO సంఘం సభ్యులు**
* **తెలంగాణ రాష్ట్రానికే మనం ఆదర్శంగా నిలవాలి**
* **మహబూబ్ నగర్ విద్యా నిధి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వరం**



మహబూబ్ నగర్ ఏప్రిల్ 09 (సమయం న్యూస్) : వివిధ రంగాల్లో ప్రజలకు సేవ చేస్తున్న మన అందరి లక్ష్యం ఒక్కటే కావాలని, అది మహబూబ్ నగర్ అభివృద్ధే అయ్యి ఉండాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు జరిగిన ఓ కార్యక్రమంలో, మహబూబ్ నగర్ "విద్యా నిధికి" TNGOS ఆధ్వర్యంలో 10 లక్షల రూపాయల భారీ విరాళాన్ని ఎమ్మెల్యే గారి సమక్షంలో టీఎన్జీవో నాయకులు జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయేందిర బోయి గారికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇది గొప్ప మార్పు అని నేను భావిస్తున్నాను అని, పేద విద్యార్థుల కోసం సమకూర్చే విద్యా నిధి అనే యజ్ఞం లో మీరు భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. మీరు ఇచ్చే ప్రతి పైసా కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల విద్యకోసం, పాఠశాలలో అవసరమైన వనరులు సమకూర్చడం కోసం, విద్యార్థులకు స్కిల్స్ పెంచడానికి, సాంస్కృతిక వారసత్వాన్ని అందించడానికి, సమగ్రమైన అభివృద్ధి కోసం ఈ మహబూబ్ నగర్ విద్యా నిధిని వినియోగిస్తామని ఆయన స్పష్టం చేశారు. మంచి కనుమరుగు కాలేదని, ఇంకా మనుషుల్లో మంచి దాగుందన్న విషయం సుస్పష్టంగా ఈరోజు నిరూపణ అయిందన్నారు. జిల్లా కలెక్టర్ గారు కూడా ఈ మహబూబ్ నగర్ విద్యా నిధికి చేయూత ఇస్తున్నారని ఆయన చెప్పారు. విద్యా వైద్య రంగంలో గత పది సంవత్సరాలు మనం చాలా వెనుక పడ్డాం అని, విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యిందని, మన రాష్ట్రం దేశం లో 35 వ స్థానంలో ఉందని ఆయన చెప్పారు. మన మహబూబ్ నగర్ పిల్లలకు మంచి విద్యను అందించి వారికి మంచి భవిష్యత్తును అందించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని, అందుకే మనం మహబూబ్ నగర్ లో ఉండే ప్రతి ఒక్కరూ తమ సంవత్సర సంపాదన లో కేవలం ఒక్క రోజు సంపాదన మహబూబ్ నగర్ విద్యా నిధికి విరాళంగా అందించాలని ఆయన ఉద్యోగులకు, వ్యాపారవేత్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్ రావు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ , టిఎన్జీఓ అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, కార్యదర్శి చంద్రా నాయక్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రియాంశ్ ఆర్య ఆ రికార్డు సృష్టిస్తాడు..
# మాజీ క్రికెటర్ ప్రశంసలు



పంజాబ్ కింగ్స్ ఆటగాడు ప్రియాంశ్ ఆర్యపై భారత మాజీ స్పిన్నర్, ఢిల్లీ కోచ్ శరణ్‌దీప్ సింగ్ ప్రశంసలు కురిపించారు. ఈ యువ బ్యాటర్ ప్రస్తుతం దేశంలోనే అత్యంత ప్రతిభావంతుడైన ఆటగాడని కొనియాడారు. ఐపీఎల్‌లో భాగంగా మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్ పంజాబ్ కింగ్స్‌కు మధ్య జరిగిన మ్యాచ్‌లో ప్రియాంశ్ అత్యుత్తమ ప్రదర్శన కనబరచడంపై స్పందించిన మాజీ క్రికెటర్ ఈ వ్యాఖ్యలు చేశారు. సీఎస్కేతో జరిగిన మ్యాచ్‌లో ప్రియాంశ్ శతకం బాదిన సంగతి తెలిసిందే. దీనిపై శరణ్‌దీప్ మాట్లాడుతూ.. ''ప్రియాంశ్ దేశంలోనే అత్యుత్తమ ఆటగాడు. మైదానంలో సరైన క్రికెట్ షాట్‌లతో వేగవంతంగా స్కోర్ చేయగల సామర్థ్యం అతడిని ప్రత్యేక స్థాయిలో నిలిపింది. కొన్ని నెలల క్రితం స్థానికంగా ఢిల్లీ మ్యాచ్‌లో అతడి ఆటను చూశాను. నాడు అతడిని డీపీఎల్‌లో దక్షిణ ఢిల్లీ సూపర్ స్టార్స్ జట్టు కోసం ఎంపిక చేశాం. నాడు ఒకే ఓవర్‌లో ఆరు సిక్స్‌లు కొట్టాడు. వంద పరుగులు చేశాడు. టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. అతడిలో ఏదో ప్రత్యేకత ఉందని నాడు గ్రహించాం'' అని గుర్తు చేసుకున్నారు. **ఇలానే ఫామ్ కొనసాగిస్తే..** ''ప్రియాంశ్ ఇలాగే తన ఫామ్‌ను కొనసాగిస్తే.. ఐపీఎల్ సీజన్‌లోనే అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టిస్తాడని అనడంలో అతిశయోక్తి లేదు'' అని శరణ్‌దీప్ సింగ్ అన్నారు. కాగా.. నాలుగో మ్యాచ్‌లో మరోసారి సీఎస్కే ఓటమి బాట పట్టేలా చేయడంలో ప్రియాంశ్ ఆర్య కీలక పాత్ర పోషించాడు. కేవలం 39 బంతుల్లోనే శతకం చేసి జట్టు విజయం సాధించడంలో కీలకమయ్యాడు. 18 పరుగుల తేడాతో పంజాబ్ గెలుపొందింది. మొదట పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

## దిగ్వేశ్ రాఠీ సక్సెస్ ...
# సీక్రెట్ అదే : మార్‌క్రమ్...



ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 18 సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ స్పిన్నర్ దిగ్వేశ్ రాఠీ ఆకట్టుకుంటున్నాడు. ఈ మిస్టరీ స్పిన్నర్‌కు ఐపీఎల్‌లో ఇదే తొలి సీజన్. పెద్దగా అనుభవం లేకపోయినా దిగ్గజ బ్యాటర్లను సైతం తన స్పిన్ మయాజాలంతో కట్టడి చేస్తున్నాడు. పొదుపుగా బౌలింగ్ చేయడంతోపాటు కీలక సమయాల్లో వికెట్లు పడగొడుతున్నాడు. ఇతను ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌ల్లో ఏడు వికెట్లు పడగొట్టాడు. ఈ నేపథ్యంలో దిగ్వేశ్‌పై లఖ్‌నవూ ఓపెనర్ ఐదెన్ మార్‌క్రమ్ ప్రశంసలు కురిపించాడు. ఈ స్పిన్నర్ సక్సెస్ కావడం వెనుకున్న సీక్రెట్ ఏంటో వెల్లడించాడు. 'దిగ్వేశ్ బౌలింగ్ ఇతర స్పిన్నర్ల కంటే భిన్నంగా ఉంటుంది. సహజంగానే అతడు బంతిని కొంచెం మిస్టరీతో రెండు వైపుల తిప్పగలడు. ఇది అతనికి పెద్ద అడ్వాంటేజ్. గుడ్ లెంగ్త్‌లో బౌలింగ్ చేస్తూ బ్యాటర్లను ఒత్తిడిలోకి నెడతాడు. బంతిపై నియంత్రణ కలిగి ఉండటం దిగ్వేశ్‌కు ఉన్న అతిపెద్ద బలం అని చెప్పొచ్చు. బంతిని రెండు వైపుల తిప్పడం అందరి వల్ల సాధ్యం కాదు. కానీ, కొంచెం చిన్న బౌండరీలు ఉన్నప్పుడు సరైన లెంగ్త్‌లో బంతిని సంధించకపోతే పరుగులు వస్తాయి. గుడ్ లెంగ్త్‌లో బౌలింగ్ చేయడంలో దిగ్వేశ్ సమర్థుడు. ఈ ఐపీఎల్‌లో అదే అతని ప్రధాన ఆయుధం' అని మార్‌క్రమ్ వివరించాడు.

# ఐశ్వర్య మెస్మరైజ్



'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో మంచి ఫేమ్ సంపాదించుకున్న చిన్నది ఐశ్వర్య రాజేశ్. పేరుకు తెలుగమ్మాయి అయినప్పటికీ ఎక్కువగా తమిళ చిత్రాల్లో మాత్రమే నటించింది ఈ ముద్దుగుమ్మ. స్పోర్ట్స్ డ్రామా కౌసల్య కృష్ణమూర్తితో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి బ్లాక్ బస్టర్ అందుకుంది. ఆ తర్వాత టక్ జగదీశ్, వరల్డ్ ఫేమస్ లవర్, రిపబ్లిక్ సినిమాలు చేసినా.. ఇవి అంతగా మెప్పించలేదు. కానీ ఏ మూవీకి రాని క్రేజ్ సంక్రాంతికి వస్తున్నాం చిత్రంతో ఓవర్ నైట్ స్టార్ స్టేటస్ అందుకుంది. మరీ ముఖ్యంగా ఈ అమ్మడు నటనకు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. దీంతో ఈ ముద్దుగుమ్మకు టాలీవుడ్‌తో పాటు తమిళ, మలయాళ వరుసగా చాన్స్‌లు వస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఐశ్వర్య కరుప్పర్ నగరం, మోహన్ దాస్, తీయవర్ కులైగల్ నడుంగ అనే తమిళ సినిమాలతో పాటు ఉత్తరాఖండ అనే ఓ కన్నడ సినిమాలో నటిస్తోంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో ఫుల్ యాక్టీవ్‌గా ఉండే ఈ బ్యూటీ తన ఫొటో షూట్స్‌తో అభిమానులను అట్రాక్ట్ చేస్తోంది. తాజాగా ట్రెడిషనల్‌లుక్‌లో కనిపిస్తూ అందరినీ ఆకట్టుకుంది. పట్టుచీరకట్టులో ఫొటోలకు పోజులిచ్చి మెస్మరైజ్‌చేసింది. ఈ పోస్టుకు ఐశ్వర్య ఓ క్యాప్షన్ ఇచ్చింది. 'నువ్వు చేయగలవని నమ్మితే సగం దూరం వెళ్లగలవు' అని జోడించింది. ప్రసెంట్ ఈభామ షేర్ చేసిన పిక్స్ తెగ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## సినిమా

# 'కన్నప్ప' రిలీజ్ డేట్ ఫిక్స్





మంచు విష్ణు హీరోగా ముకేశ్ కుమార్ సింగ్ తెరకెక్కిస్తోన్న పాన్ ఇండియా సినిమా 'కన్నప్ప'. మోహన్‌బాబు, ప్రీతి ముకుందన్, శరత్‌కుమార్, ముకేశ్ రుషి, రఘుబాబు, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రభాస్, మోహన్‌లాల్, కాజల్, అక్షయ్‌కుమార్ అతిథి పాత్రల్లో కనిపించనున్నారు. ఏవీఏ ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్ ఫ్యాక్టరీ పతాకంపై మోహన్‌బాబు నిర్మిస్తున్న చిత్రమిది. అయితే ఈనెల 25న దీనిని థియేటర్లలో విడుదల చేయాలని తొలుత టీమ్ భావించింది. అయితే వీఎఫ్ఎక్స్ పనులు ఆలస్యం కావడంతో వాయిదావేసింది. తాజాగా సినిమా కొత్త విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. జూన్ 17న ఈ చిత్రం రిలీజ్‌కానున్నట్లు పేర్కొన్నారు. కాగా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ను సీనియర్ నటుడు మంచు మోహన్ బాబు, ఆయన తనయుడు నటుడు విష్ణు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇవాళ ఉదయం లఖ్‌నవూ చేరుకున్న వారిద్దరూ ముఖ్యమంత్రిని కలిసి 'కన్నప్ప' విశేషాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా 'కన్నప్ప' కొత్త రిలీజ్ డేట్ పోస్టర్‌ను యోగి ఆదిత్యనాథ్ విడుదల చేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ విష్ణు ట్విట్టర్ వేదికగా పోస్ట్ పెట్టాడు.

## కరెంట్ బిల్లు చూసి
# షాకయ్యా



హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బాలీవుడ్ ఫైర్ బ్రాండ్, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తన ఇంటికి రూ.లక్ష కరెంట్ బిల్లు వచ్చిందన్న ఆమె.. అసలు ఆ ఇంట్లో తాము నివాసమే ఉండటం లేదని పేర్కొంది. అలాంటప్పుడు అంత బిల్లు ఎలా వస్తుందంటూ ఫైర్ అయ్యింది. ఈ మేరకు మండిలో జరిగిన ఓ కార్యక్రమంలో కంగనా మాట్లాడుతూ 'మనాలీలో ఉన్న నా ఇంటికి ఈ నెల రూ.లక్ష కరెంట్ బిల్లు వచ్చింది. నేను నివసించని ఇంటికి ఈ రేంజ్‌లో వచ్చిన బిల్లు చూసి షాకయ్యా. ఒకరకంగా చెప్పాలంటే ప్రభుత్వ చర్యకు సిగ్గుపడుతున్నాను. అయినప్పటికీ మనందరికీ ఒక అవకాశం ఉంది. నా సోదరీ సోదరులను నేను కోరేది ఒక్కటే. ఇలాంటి సమస్యలపై మనమంతా క్షేత్రస్థాయిలో పనిచేయాలి. దేశాన్ని, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాల్సిన బాధ్యత మనపై ఉంది. ఈ తోడేళ్ల చెర నుంచి మన రాష్ట్రాన్ని కాపాడుకుందాం' పిలుపునిచ్చింది. ఇక సినిమాల విషయానికి వస్తే.. కంగనా చివరగా నటించిన చిత్రం ఎమర్జెన్సీ. ఈ మూవీలో ప్రధాన పాత్రలో నటించడంతో పాటు తొలిసారి దర్శకురాలి అవతారమెత్తింది. అంతేకాక తన సినిమాను తనే నిర్మించింది. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో విధించిన ఎమర్జెన్సీ ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. బాక్సాఫీస్ వద్ద రాణించలేకపోయిన ఈ మూవీ ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉంది.

# ఎన్టీఆర్ కొత్త సినిమా.. కీలక అప్‌డేట్..

ఎన్టీఆర్ దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో ఓ పాన్ ఇండియా చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ అధికారికంగా ప్రారంభమైంది. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓ కీలక అప్‌డేట్‌ను చిత్ర నిర్మాణసంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఎక్స్ వేదికగా పంచుకుంది. ఈ సినిమా చిత్రీకరణలో ఏప్రిల్ 22 నుంచి ఎన్టీఆర్ పాల్గొననున్నట్లు తెలిపింది. కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు పేర్కొంది. ఇందులో భారీస్థాయిలో యాక్షన్ సీన్స్ ఉండనున్నాయని వెల్లడించింది. ఇటీవల కూడా ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్‌ను నిర్మాణసంస్థ షేర్ చేసింది. భారతీయ సినిమా చరిత్రలో ఒక మార్క్‌ని క్రియేట్ చేసేలా ఇది ఉండనున్నట్లు తెలిపింది. ఈ పీరియాడిక్ మాస్ యాక్షన్ డ్రామాలో ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ కనిపించనున్నారు. మలయాళ యువ హీరో టొవినో థామస్ కీలక పాత్రలో సందడి చేయనున్నట్లు సమాచారం. ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 9న ప్రేక్షకుల ముందుకురానుంది. దీనికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.



Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.